C. P. BROWN
MEMORIAL LIBRARY
Acc. No 5293
Date
CUDDAPAH.

1

సీత

ఒక మహారణ్యం తగులబడిపోతున్నది.

జంతువులు చెల్లాచెదరుగా పరుగులు పెడుతున్నాయి. బండరాళ్లు సైతం ఫెటేలు ఫెటేలుమని విచ్చిపోతూ ఎగిరెగిరి పడుతున్నాయి. చిన్న చిన్న చెట్లు—చిట్టి పొదలు, నిప్పు చుట్టేసుకోగా గాలికి గిర్రున తిరుగుతూ, ఒకచోటునుంచి మరొకచోటుకి పరుగులెత్తినట్లుగా అనిపిస్తోంది.

పొగ పెద్దరాక్షసుడిలా లేచింది.

తప్పించుకు పారిపోలేని పక్షులన్నీ, ఆ పొగలో రెక్కలార్చుకుంటూ-ఎగరగలిగినంతగా పైకిపైకి లేచి, గిలగిలా కొట్టుకుంటున్నాయి. నేలమీది పుట్టల్లోని కలుగుల్లోని రకరకాల పాములు, దొర్లుకుంటూ, ఎగురుతూ, దూకుతూ, మంటల్ని తప్పుకుందుకు పరుగులెడుతున్నాయి. మొదళ్ళు కాలిపోగా పెద్దపెద్ద వృక్షాలు మండుతూ మండుతూ నేల కొరుగుతున్నాయి. భూమి మంటలతో చిటపటలాడుతున్నది. రామచిలుకలు పిచ్చుకలదగ్గర్నుంచి, పావురాలు డేగలు రాబందులవరకూ ఎగరలేక రాలి పడిపోతున్నాయి. కట్టలు కట్టలుగా వెలికివచ్చి పరుగులు పెడుతున్న పాములు తుట్టలు తుట్టలుగా కాలి రాళ్ళక్రిందకు—లోయల్లోకి పడిపోతున్నాయి.

ఇంతింతలేసి మంటలు! రాక్షసి పొగ! ఈ అందమైన సృష్టి యొక్క వినాశమంతా ఎక్కడో నా హృదయంలో జరుగుతున్నట్లే వుంది.

ఆ పొగలు-మంటలు రకరకాల ప్రాణుల హాహాకారాల వెనుక, పైనుంచి కాలిపోతూ రాలిపోయే పక్షులరెక్కల గిజగిజల వెనుక ఒక మానవ కంఠం కొద్దిగా వినవస్తున్నది.

ఈ తగులబడిపోతున్న ప్రకృతి వెనుక ఒక మానవ స్వరాన్ని విన్న నా అవస్థ యేమని చెప్పుకోను?

గులాబీరంగు లేతపాదాలమీద జీరాడే పాలమీగడ వన్నె కుచ్చెళ్ళు—పరుగెత్తుకుంటూ, ఆ మంటలలో భగ్గునమండే రాళ్ళను యెక్కి దూకుతున్నప్పుడు....గప్పున ఆ చిన్న నడుమును రెండు చేతులా దొరకపుచ్చుగుని ఆమెతో ఆకాశంలోనికి పరుగెత్తగలిగితే.... వాెవ్వా!

—రాక్షసి పొగ నన్నుచూసి నవ్వింది.

మళ్ళీ ఒక రాబందులతుట్ట కాల్తూ రాల్తోంది. ఒక మహావృక్షం మంటల్లో వ్రారుగుతూన్నది.

అయ్యో! అయ్యో! ఆ లేత గులాబీవన్నె పాదాలు! చెదరిచెదరి వేస్తున్నది అడుగులు. బెదరి బెదరి చూస్తున్నది మంటలు.

తెల్లటి కుచ్చెళ్ళ ప్రక్కనుంచి పాములు తుట్టగా దొర్లుకుంటూ పోతున్నాయి. పూల పొట్లాల్లాటి అరచేతులు రెంటితో తామర మొగ్గల్లా, చెమర్చి కందినట్లున్న వక్షఃప్రదేశాల్ని కప్పుకొంటూ ఆ పిల్ల పరుగు లెత్తు తున్నది. పాలరాతి శిల్పంలా చేయివేస్తే జారిపోయేట్లున్న ఆ మెడనిండా ముత్యాలు ముత్యాలుగా చెమట పొటమరిస్తోంది. తల అటూ యిటూ త్రిప్పుతున్నది. చెక్కిళ్లు ఎరుపెక్కాయి. ఆమె కళ్ళకేసి చూశాను. అయ్యో—ఏడుస్తూంది గావాల్ను! ఇంక లాభంలేదు. పాపం, పరుగెత్తి అలసినట్లుంది. ఏ రాయో ప్రేలిపోయి మీదపడి తల బ్రద్దలవుతుంది. ఆ పాల మీగడ వన్నె కుచ్చెళ్ళు, ఈ రోజారంగు పిల్ల యొక్క ఆ అందమైన చిన్ననోరు, పట్టుతివాసీలమీద పరుగెత్తవలసిన పాదాలు, ఇంకా వొణుకుతున్నట్లున్న ఆ పెదవులు, అంతా—యిందాకటి చెమర్చి కందినట్లున్న తామర మొగ్గల జంట, సర్వమూ నుగ్గు నుగ్గయి బొగ్గు బొగ్గయి కాలిపోవలసిందేనా?

నిలువు నిలువునా నేను దహనమైపోతున్నాను.

ఆ వొణికే పెదాలను పంటితో అణచటానికి యత్నిస్తున్నది నొక్కి. కళ్ళవెంబడి వాకొక్క చుక్కే రాలి చెంపలమీదుగా పరుగెత్తి టప్పుమని దిగువకు దిగుతున్నాది. పరుగెత్తి అకస్మాత్తుగా నిలిచి పోయిన ఆమె కాళ్ళు కంపిస్తున్నాయి. ఆ తెల్లటి పావడా బరువుగా క్రిందకు లాగేస్తున్నది.

నేను నెత్తి మొత్తుగుంటున్నాను. జుట్టు పీక్కొంటున్నాను. కళ్ళు పొడుచుకుంటున్నాను.

ఆమె రెండు చేతుల్నీ ఊపుకుంటూ నిలబడింది. వెనుక తగుల బడిపోయే అరణ్యం తరుముకొస్తున్నది. నా మట్టుకు నేను ఆ మనో హరమూర్తిని ఎత్తుకుని పారిపోగలిగితే....రక్షించుకోలేనా అని వాపో తున్నాను. ఆ పిల్ల అంత ఎత్తునుంచీ నేను చూస్తూండగా వురికింది. వురికి—నా గుండెలమీద వచ్చి పడింది.

నేను నిద్రనుండి మేల్కొన్నాను. కన్న బీభత్సంతో నా మెద ళ్ళోని నరాలన్నీ సడలిచ్చేశాయి. నేను చూసిన సౌందర్యంతో నా హృదయం నిండుగా వూరింది.

రోజా వన్నెపిల్ల నా కళ్ళలో మెసుల్తున్నాది.

గదికి తాళంవేసి క్రిందకుదిగి హోటల్లో బల్లముందు వచ్చి కూర్చు న్నాను. దీపాలు మసగమసగ్గా వెలుగుతున్నాయి. నేను కూర్చున్న చోటునుండి చూస్తే ఖణఖణ మండే పెద్దపొయ్యి, దాని ముందుగా ఒక ముసలావిడ అవుపించారు. చుట్టూ గోడలు నలనల్లగా మసిబారి వున్నాయి.

చప్పట్లు, గోలగా నవ్వు వినిపించి, భరించలేక తలెత్తి ప్రక్కకు చూశాను. డబ్బుల బల్లదగ్గర కుర్చీలో మిలమిలా మెరుస్తున్న రెండు కళ్ళు. బాగా ఎదిగినా నడుం వంగిపోయింది. పిడతలా తల, అతికి నట్లున్న ముక్కు, బాకాలాటి నోరు, దొప్ప చెవులు. వుండి వుండి లేచి ఒక చేత్తో ముందుకు వంగి 'సర్వరు' గుడ్డల్ని పీకుతున్నాడు. బొత్తాములు పెట్టని బాగా వొదులుగా వ్రేలాడే చొక్కా, ఆలివురంగు నిక్కరు—ఆ నిక్కరు జారిపోయి మోకాళ్ళమీదకు వచ్చి నిలబడింది.

కమ్మటి కాఫీ ఆప్యాయంగా చప్పరిస్తూండగా గ్రద్దముక్కు, చీకట్లో మెరసే ఆ అయోమయ దృక్కులు, నా వైపు తిరగటంతో సగం కాఫీ అట్టే విడిచి లేచిపోయాను.

పొయ్యిమంట ముఖానకొట్టగా చెంగుతో వొత్తుకుంటూ ముస లమ్మ "రాత్రి భోజనం గదిలో పెట్టమంటావా నాయనా?—" అంటూ వచ్చింది.

"అక్కడ లేదమ్మా—రాత్రి మరిక రాను. నాకు డ్యూటీ...." అనేసి వెళ్ళిపోతూండగా వెనుకనుంచి వచ్చాయి మాటలు—

"పెద్దదాన్ని, కూర్చునే వో కునుకు తీస్తుంటాను. బద్ధకించేవు నాయనా, లేపడానికి...."

"అయ్యో పాపం, మంచిమనిషి" అనుకుంటూ అడుగులు ముందుకు వేస్తున్నాను. కాని ఆ వెర్రిపిల్లాడు చూపుడువ్రేలు ఆడిస్తూ నా మీద మీద కురుకుతున్నట్లే అనిపించసాగింది.

గుండెల్లలో నిండుగా దూకి నన్ను మధుర స్రవంతిలో వోల లాడిస్తున్న నా రోజారంగు పిల్ల యింకా అక్కడే వున్నట్లు తోచి అర చేత్తో ఛాతీ రాసుగుంటూ రాతిమెట్లు దిగిపోతున్నాను. దిగితే యిక నున్నటి సిమెంటు రోడ్డే....మనుష్యుల ఆకారాలు, వివిధ వాహనాలు అన్నివైపులనుంచీ కదుల్తున్నాయి.

నేను ఎక్కిదిగుతున్న రాతిమెట్లు క్రిందుగా మురికికాలువ నెమ్మదిగా పారుతోంది. కొంచెం సమీపంగానే లాంతరు స్తంభంయొక్క వెల్తురులో ఒక సన్నటి నీడ కదుల్తూ యిటువైపే రావటం గమనించాను. చాలా నెమ్మదిగా కదుల్తున్న ఆ నీడతోబాటు టక్కు టక్కుమనే కట్టువైన శబ్దంకూడా విన్నాను.

ఎవరో కుంటిపిల్ల నావైపే చూస్తూ ఆగింది. వూతకర్రమీద ఆనకపోయినట్లయితే నేను అకస్మాత్తుగా ఎవరో ముష్టిపిల్ల అనే నిర్ణయానికి చప్పున వచ్చివుండకపోదును. చంకలో కూజా పొందికగా యిమిడివుంది. బహుశా నీరు తెస్తూండవచ్చు. నడినెత్తిన కాస్తంత పల్చగా జుట్టు, కోలముఖం, పాపటనుంచి కనుబొమల మధ్యకు ఎంత దూరమో సరిగా యించుమించు అంతే దూరాన చుబుకమూ, లోనికి దిగిపోయిన గుంటకళ్ళు—ఆ చీకట్లో రెండు మిణుగురు పురుగులా అనిపించక మానదు. ఒక కాలు మెలిదిరిగిపోయి వ్రేలాడుతోంది. ఇక ముందు యెప్పుడైనా ఆడదానిపట్ల యే విధమైనటువంటి మమకారం గాని పెట్టుకోదల్చుకున్నట్లయితే యీ మనిషి ముఖం ఒక్కమారుకూడా మగవాడు చూడకూడదు.

అసహ్యంతో నిండిన మనస్సుతో జేబులోనుంచి రెండణాల కాసును తీసి "ఎందుకల్లా నిలబడి చూస్తావ్? ఫో....ఫో...." అని ఆ మెలిదిరిగిపోయిన పాదాలవద్ద పడేట్లు విసిరేసి గబగబా రోడ్డుమీదకు నడవబోయాను.

నా వెనుక పెద్ద చప్పుడయింది.

ఆ అవిటిపిల్ల మెట్లదగ్గర కూజాను ఎత్తేసింది. ఆ నీళ్ళు, మన్ను అంతా చింది నా బట్టలమీదకూడా వెనుక కొంత పడొచ్చు. నేను విసిరేసిన బేడ కాసు మాత్రం నేలమీద నీళ్ళమధ్య బురదలో మెరుస్తోంది. అందులోనే ఆ అవిటిపిల్ల చంకనుండి రాలిన వూతకర్ర కూడా పొర్లాడుతోంది.

"నేనేమీ ముష్టిపిల్లను కాదండీ...." అన్న గొంతు వినిపించి నన్ను కమిచీతో బాదినట్లు కాగా అదేపనిగా పరుగెత్తినట్లు నడిచాను. వీధి మలుపు తిరిగి మరోలాంతరు స్తంభంవరకూ వచ్చాక గుండె తడిమి చూసుకున్నాను. రోజారంగుపిల్ల—లేదు. స్మృతే మిగిలింది.

ఎంత ప్రయత్నించినా మీదమీదకు వస్తూ చూపుడు వ్రేలాడించే వెర్రిపిల్లాడూ, మెలిదిరిగిపోయిన కాలుతో వూతకర్ర టక్కుటక్కుమనిపిస్తూ నా హృదయంలోనుంచి రోజారంగు పిల్లను తరిమేసిన ఆ కుంటిపిల్ల—వీళ్ళే మిగిలారు.

లేత గులాబీవన్నె పాదాలు, పాలమీగడరంగు కుచ్చెళ్ళు, వాణికే పెదాలు, చిన్ననోరు, పిట్టలాటి నడుమూ అన్నీ మాయమయినై. వీటిస్థానే నడినెత్తినుంచి పాపట, కోలముఖమూ, మిణుగురు పురుగుల్లాటి కళ్ళు పదే పదే జ్ఞాపకానికి రాసాగాయి. మనస్సులో ఏడ్చినంతసేపు ఏడ్చాను, అంతుచిక్కని రోజారంగు పిల్లకోసం. నాకు చేతనయినన్ని రకాలుగా తిట్టుకున్నాను ఆ రెండు ముఖాల్ని.

చివరికి రెంటినీ నిత్యమూ చూడ్డంనుంచి తప్పుకోవటంకోసమైనా ఆ హోటల్నుంచి మకాం ఎత్తటంవరకూ బుర్ర పాడుచేసుకుని ఆలోచించాను. ఆ రాత్రి రాత్రల్లా నిజంగా ఒక మహారణ్యం తగలబడిపోతున్నట్టే వుంది నా మెదడులో!

ఏమైనా పదిగంటలవరకూ లేవకూడదనే తలపుతో ముసుగు తన్ని పరున్న నేను యెవరో తలుపుమీద దబదబా బాదటంతో విసుక్కుంటూ లేచాను. "గది తుడవమంటారా?" అంటూ వచ్చిన హోటలు కుర్రాణ్ణి "ఛీ పొమ్మ"ని గసిరేశాను. ఆ వుదయం వరండాలో పచార్లు చేస్తుండగా ముసలమ్మగారు వచ్చింది. ఆవిడకు కొంచెం కోపం వచ్చి వుండాలి రాత్రి భోజనానికి రానందుకు.

"కూజాలో నీళ్ళు పట్టమనీ, గది శుభ్రం చెయ్యమనీ కుర్రాణ్ణి పంపిస్తే కొట్టవచ్చావుటగా నాయనా! నేనే తీసుకుపోదామని వచ్చాను. నీకు ఎల్లాటి పిల్లలు పుట్టుగొస్తారనీ....యింకా బలమైన ఆహారం తింటే—"

నేను చప్పున సిగ్గుపడిపోయానల్లే వుంది.

ఏళ్ళతరబడి శాశ్వతంగా హోటళ్ళకు అంకితమయే నా జీవితం జ్ఞప్తికొచ్చి నవ్వుకున్నాను. బహూ బద్ధకస్తుడుగా జీవించటంలో నాకు నేనే తీరని అన్యాయం చేసుకుంటున్నానేమో అనిపిస్తోంది. ఇక యీ వయస్సులో యేర్పడ్డ అలవాట్లు జీవితం పొడుగునా మారవు. ఇల్లు, కాపురం, పెళ్లాం పేరు చెప్పుకొని యెప్పుడో తొంగిచూడబోయే వొక క్రొత్త అమ్మాయి- యీ వూహలు ఎంతోదూరాన వర్షించని మేఘాల్లా పరుగులు పెడుతూంటే, నిన్న సాయంత్రంవరకూ కనిపించిన రోజా రంగుపిల్ల తలపులు తిరిగి నాలో చిందులు త్రొక్కసాగాయి.

వయస్సులో అమ్మాయిలు చాలామంది బావుంటారనే అభిప్రాయం నాకుంది. అందుచేత పెట్టిబండ్లలో స్కూళ్ళకు పోయే అమ్మాయిలు, సాయంత్రం బీచిలో వరసాగ్గా కూర్చొని యిసుకలో కేరింతాలు కొట్టే ఆసుపత్రి నర్సులు, సినిమాహాల్లోని జంటలను విడదీస్తే వచ్చే ఆడముఖాలు యిన్ని చూస్తుంటే యిన్ని సంవత్సరాలుగాను వీటిల్లోని యే ముఖాన్నిగాని నాకుగాను కావాలని అనుకోలేదు. కాని వానలో యెండలో గొడుగులు పుచ్చుగొని చేతిలో చిన్న సంచీ, అరికాళ్ళకు తొడిగిన చవకరకం చెప్పులతో స్కూళ్ళకు పరుగెత్తే మిస్సమ్మల్ని చూసినప్పుడల్లా జాలిపడేవాణ్ని. డబ్బు పాడుచేసుకుని జీవితాన్ని లక్ష్యం చెయ్యక బహూ బద్ధకస్తుడిగా నేను గడించినదాన్లోకల్లా యీ అను

భవాన్నే పదిలంగా జీవితాంతంవరకూ గుర్తు పెట్టుకోవలసి వుంటుంది.

తువ్వాలు భుజాన్నేసుకుని హోటలు నుయ్యి ప్రక్కకు చేరాను. బాగా ప్రొద్దెక్కడంచేత అప్పుడే చాలామంది అక్కడ పోగయ్యారు. మాట్లాడేవాళ్లు మాట్లాడుతున్నారు. ఎండ పొడుచుకొస్తోంది. ఒక ప్రక్క నుంచి నీరు తోడుకొని స్నానం చేస్తున్న నాకు నూతిగట్టుకు ఆన్చిన కుంటివాళ్ళు చంకను బెట్టుకునే వూతకర్ర హఠాత్తుగా అగుపించింది. ఆ ప్రక్కనే ఎర్రటి కెంపురంగు పరికిణీ పువ్వుల పువ్వుల వోణీపిల్ల కూర్చుని చాలా కూజాలను ముందేసుకుని ఒక్కటొక్కటే శుభ్రం చేస్తున్నది. అట్లా తొలిచిన కూజాల్లోకి ఒక కుర్రాడు నీళ్ళు తోడి నింపుతున్నాడు. ఆ ముఖం చూడవలసివస్తుందేమోనని ఆతర్గంగా రావటంలో వాళ్లకూడా సరిగా రుద్దుకోలేదు. బహుశా నా కూజాకూడా అందుల్లో వుండవచ్చు గదా అని తోచింది. గుర్తుకోసం నా కూజా మీద చాకుతో "S" అని చెక్కాను కూడా.

మరోగంట గడిచాక కాటోలు వసారాలో "టక్కు టక్కు" మనే కర్కశమైన ధ్వని వినవచ్చింది. ఆ కుంటిపిల్ల యీ హోటల్లోనే పని చేస్తూండాలి; పొట్టకోసం కష్టపడ్డానికి మగవారిలా ఆడవాళ్లు పనికి రారనే అభిప్రాయం నాకుంది.

కుర్రాడు నా కూజా తెచ్చి కిటికీలో వుంచుతుండగా "ఆ టక్కు మనే దేవిట"ని అడిగాను.

"అదా—నీలి బాబూ, నీలి. గదు లూడుసుతుండాది."

"ఆహ" అని తల వూపాను.

"వోరి వూసే అక్కర్నేదు బాబూ! ఆయమ్మి గొడబేటో........ పనేటో...." అనేసి కొంచెంగా నవ్వి వెళ్ళిపోయాడు.

ఆ కెంపులరంగు పావడా టక్కు టక్కుమనే అ కర్రతో నా గదిలోకి రాకుండావుంటే చాలు అనుకుని లేచి వెళ్ళి గెడేసొచ్చాను.

గది యింకా సర్దలేదు. ఎక్కడ వస్తువు లక్కడ చెల్లా చెదురుగా పడివున్నాయి. క్యాంపు కాటుమీద పరిచిన హోల్డాలు బెల్టులు నిన్నటి కలల్లోని కాలిపోయి దొర్లుకుపోతున్న పాముల్లా వ్రేలాడు తున్నాయి. నా పెట్టెమీద పారేసిన దుస్తుల జతలు, కొంకిన వ్రేలాడు

తున్న పంట్లాములు గ్రద్దలూ—రాబందుల్లానూ, గది గుమ్మంవద్ద పేర్చిన బూడ్సులు బండరాళ్ళలానూ కనిపించాయి.

తలుపు కాస్త కిర్రుమంది. టక్కు టక్కుమనే చప్పుడు చెవి దగ్గరలోకి వచ్చి ఆగినట్లే వుంది. దాని వెంబడిని తలుపు రెక్క మీద ఎవరో నీరసంగా చేయి ఆన్చినట్లు కూడా వేసింది, నాకు అనుమానం.

"బాబుగారూ!" అన్న పిలుపు—

తగులబడిపోతున్న ఒక మహావృక్షం నెమ్మదిగా నా మీదకు వొరుగుతున్నట్లే ఫీలయ్యాను. నా గుండెలమీద కురికి నిలచిన ఆ ఒక్క మధుర స్మృతికూడా నాకు చిక్కదేమోనన్న భయం లోపల విపరీతంగా వేధిస్తోంది. అయిష్టంతోటే, బలవంతాన ఎవరో త్రోసినట్లుగా వెళ్ళి తలుపుగెడ తీశాను. ఏం చెప్పను?

నా గది గడపవద్ద ఎర్రపావడా పూలవోణీ 'నీలి' కుప్పలా చతికిలబడి వుంది. డొక్కలో కాళ్లు తన్నిపెట్టుకుని తోకను కొరుక్కుంటూ హోటళ్లలో బల్లక్రింద పడుకునే దిక్కుమాలిన కుక్క జ్ఞాపకమొస్తోంది.

నీలి తన మెలితిరిగిన కాలు మడతవేసి ఆ వూతకర్రను నేల మీద ఒక చేత్తో త్రోసుకుంటూ రెండవ చేత్తో వూడుస్తున్నది. ఆమె ఆవిధంగా దేకుతున్నప్పుడు తన మోకాళ్ళను దాటి పరికిణీ వెనక్కు పోకుండా మధ్యను ఆగి కప్పుకొంటున్నది. చూస్తే మనిషిలో ఎముకలూ, ఆ బొమికలను కప్పేందుకుగాను చర్మమూ తప్ప మరే విధమైనటువంటి మృదువైన మెట్టపల్లాలు కనీసం మచ్చుకైనా దొరకని ఆమె 'మాంసం'పట్ల అంత అభిమానం కనపర్చటం నిజంగా నాకు ఆశ్చర్యాన్నే కలిగించింది.

తలలోవున్న ఆ పదిపరకల జుత్తులోనూ ఒక ఎర్రగన్నేరు పువ్వు తురిమింది. ఆ కాలు యీడ్చుకుంటూ వసారా అంతా తాబేలులా తుడుచుకొస్తున్నది. మెడమీదనుంచి కారుతున్న చెమటను పవిట చెరుగుతో వొత్తుకుని, లోతుకు దించుకుపోయిన కళ్లతో ముఖమెత్తి, "గది వూడుస్తాను బాబూ!" అన్నది.

చాలా లేతముఖము—పధ్నాలుగు పదిహేనేళ్ళకు మించి వుండక పోవచ్చును.

ఆ అవకరపు మనిషి ముఖం నా మనస్సంతా కలచివేస్తున్నది. నా ఎదురుగా కుప్పలా చతికిలబడింది. నేను పీలుస్తున్న గాలే తనూ పీలుస్తున్నది. ఇంక నాకు సంబంధించిన ప్రతి వస్తువూ ముట్టుకుని నా దైనిక జీవితంలోనికి అనవసరంగా తొంగి తొంగి చూస్తూ నన్ను మానసిక వ్యధపాలు చేసేలాగుంది. నాకు కోపంలా వచ్చి అనేశాను— "టట్! వీల్లేదు. ఆ చీపు రిల్లా గియ్యి. యిస్తే నేనే తుడుచుకుంటాను రోజూ.........."

కసిరినందుకు అభిమానంతో తలకాయ వ్రేలేసుకుని దేకుతూ నీలి మెట్లవైపు కదలటం చూశాను. ఈ రోకలిబండలా ప్రాకే ఎముకల కుప్పను రెండుచేతులా యెత్తి మళ్ళీ యీ చాయలకు రాకుండా విసిరెయ్య గలిగితే—అసహ్యంతో నిండిపోయిన నా మనస్సు ఎంత త్వరలో యిక్కడ్నుంచి బైటపడి మరో హోటలు చూసుకోగలిగితే అంత మంచిదిలా తోచింది. చెప్పానుగా—బహు బద్ధకస్తుణ్ణని.... ఐతే ప్రపంచంలోని వికారమైన మనుష్యులతో జట్టీలు పెట్టుకుందుకు గాదు నేను—అందమైనవాళ్ళకే యీ భూమిమీద జీవించటానికి హక్కు వున్నట్లుగా చెప్పాలనీ నాకు లేదు. కాని ఒక విచిత్రమైన స్థితిలో నన్నేదో మనోవ్యధల్లో ముంచే యీ ముఖాలనుండి తప్పుకుని బ్రతకాలనే యోచనే బహుశా నా మానుష ప్రవృత్తిని అణగ ద్రొక్కేస్తూ వచ్చివుండవచ్చు.

ఉంటే డ్యూటీ చూసుగోవటం, లేకపోతే వూరంతా చాంద్రాయణం చేసేవాణ్ణి. గది తాళాలుకూడా హోటలుకుర్రాడి ముఖాన పారేశాను. ఎప్పుడన్నా తోస్తే రెండుమెతుకులు కొరికేవాణ్ణి. లేనిరోజున ఆ పళ్ళెం అట్లానే నవుకరు కుర్రాడు పట్టుగెళ్ళిపోయేవాడు. క్లబ్బులో పేకాట....రోజూ జేబు ఖాళీ కావటం—దాన్తో చిరాకుగా కోపంగా వుండాల్సి వచ్చేది. ఆరోగ్యమంటే యంత లక్ష్యంలేకుండా యెందుకు ప్రవర్తించానో నాకే అర్థం కాలేదు. చాలారోజులకి మళ్ళీ అద్దంముందు కూర్చున్నాను. బుర్ర కుతకుతా వుడికిపోతున్నట్లుంది. తలనిండా

దుమ్ము....కళ్ళుకూడా గుంటలుపడి లోతుకు దించుకుపోయాయి. గడ్డం తడుముకునేసరికి టెంకాయ చిప్పకుమల్లే గరుకుగా తగిలింది.

ఇన్నాళ్ళకు ఆ రోజు నాకు శలవు. ఎక్కడకూ వెళ్ళటానికి వంట్లో నాకు శక్తిలేదు. సిగరెట్లు తెగకాలుస్తున్నానేమో ఖుళ్ళుఖుళ్ళు మని దగ్గుకూడా వస్తోంది. ఈ దగ్గు ఒకప్రక్కనుంచి ప్రాణాలు తోడేస్తూంటే ఆ రాత్రి భయంకరంగా గడిపాను.

కడుపులో ఏమీ యిమడ్డంలేదు. రెండుమార్లు తిన్నదీ త్రాగినదీ అంతా నిద్రలో కక్కేసుకున్నాను. నోరంతా అసహ్యంగా మారింది. బట్టలు కుళ్ళువాసన గొడుతున్నాయి. గొడ్డళ్ళతో బాదినట్లు తలనొప్పి—వో రాత్రి వేళకు జ్వరం చర్రున త్రాచుపాములా లేచింది. రోగానికి లొంగిపోయి బిగ్గరగా యేడ్చేశాను. మళ్ళీ నాకు తెలివి వచ్చేసరికి చూస్తే భళ్ళున తెల్లవారింది. నా పక్కను ముసలమ్మగారు కూర్చుంది.

"భయంలేదు నాయనా!" ఆవిడ నా మీద చేత్తో నిమురుతూంటే, నేను రెండుచేతులా ముఖం కప్పేసుకున్నాను. మళ్ళీ ఆవిడే అందుకున్నది-"చెప్పేవాళ్ళు లేకగాని నీవంటి పిల్లవాడ్ని అదుపాజ్ఞల్లో పెట్టగోదూ?—యింత విచ్చలవిడిగా యిష్టమొచ్చినట్లు ఆరోగ్యం పాడు చేసుకోనిస్తుందీ? చేసుకున్న పెళ్ళామే ఐతే...."

వ్రేళ్ళ సందుల్నుంచి చూస్తున్నాను. నేను కక్కిపోసిన ప్థలమంతా బూడిదచల్లి వోపిగ్గా కడిగి యెత్తిపోస్తున్న ఎర్రపావడా నీలి ప్రత్యక్షమైంది. వెంటనే తలెత్తి—"ఆ చీపు రక్కడ పారెయ్. నీకు ఎన్నిసార్లని చెప్పాను నా గదిలో కాలుపెట్టవద్దని....పోతావా పోవా ముందు. ఛో...."

తను నా మాటల్ని విననట్టే, తలకాయ వాల్చుకుని నీలి తన పని తాను చేసుకుపోతున్నది.

"ఛీ! ఆ మొండితనం చూడండి."

ముసలమ్మగారు నవ్వి "అదే రాత్రి మెల్లగా కుంటుకుంటూ వచ్చి నన్ను లేపింది- ఆ క్రొత్తగా వచ్చిన బాబుకి వంట్లో బాగులేనట్లుంది, వెళ్ళి చూడమ్మా అని."

నేను వెలవెలబోతూ అడిగాను- "నీలి మీ అమ్మాయా?" అని. నాకు తల గిర్రున తిరిగినట్లయింది.

"అవు న్నాయనా, ప్రపంచంలో యిన్నిరకాల ముఖాలవాళ్ళున్నారు గదా- మా నీలిని చూస్తే యెందుకు నాయనా నీ కంత కోపం?"

ఇల్లా అమాంతం నా మంచం యెగిరి మరో ముక్కూ మొగం తెలియనిచోటికెళ్ళి పడకూడదా అనిపించింది. ఆవిడ అనవసరంగానే ఐనా ఒకమారు చెరగుతో కళ్ళు వొత్తుకుని మరీ చెప్పింది-"నా దరిద్రం కాలిపోను! డబ్బవుతుందిట. కాని కాలుమాత్రం మళ్ళీ వస్తుంది. కోసి సరిచేస్తా మన్నారు డాక్టర్లు."

నాకు లోలోపల 'ఆ సహాయం మీకు నేను చేయిస్తాను. మీ నీలికి కాలు తెప్పిస్తాను' అని అనాలనుంది. కాని నోరు పెగల్చలేక పోయాను. మళ్ళీ నన్ను నేను తిట్టుకున్నాను. ఏ నిన్నో మొన్నో యీ హోటలునుంచి మకాం యెత్తేసినా బాగుండిపోయేది. కురూపినైముఖాన్ని లోకానికి చూపించవచ్చుగానీ కృతఘ్నుడ్నైన్నా చూపడానికి యిష్టంలేక దుప్పటి తలంటా లాక్కున్నాను. జ్వరంకన్నా అభిమానం యెక్కువై ఆ రోజల్లా మంచం దిగలేదు. రాత్రి పదిగంటలవేళ ఒక అఘాయిత్యం తలబెట్టాను. అంతవరకూ లేని ధైర్యం, చొరవ అప్పుడు నా కెక్కడ్నుంచి వచ్చిందో లేచి మెట్లు దిగి బయట వీధిలో కొచ్చేశాను. నాలుగు రిక్షాలను చెప్పి వాళ్ళను వచ్చి హోటలు బయట నిలబడ మన్నాను. తరువాత గొడవచేయకుండా వాకరి వెంటొకర్ని నెమ్మదిగా మెట్లెక్కి మేడమీదకు రమ్మన్నాను. లోపల నాకు నీరసంగానే వుంది. గదిలో సామానంతా వాళ్ళచేత సర్దించి చడీచప్పుడు లేకుండా ఖాళీ చెయ్యాలనీ, మిగతా లావాదేవీలు బయటనుంచి సర్దచ్చు అనీ అనుకున్నాను. ప్లాను అద్భుతంగా మట్టుకు వుంది. కాని ఆచరణలో అది కాస్తా బట్టబయలై నవ్వులపా లయ్యాను.

అంతవరకూ నా గది దగ్గర కాపలాకు మనిషి పడుకున్నాడనే నాకు తెలియదు. రిక్షావాళ్ళు పైకి వచ్చారు. గదిలో సామానులు సర్దిస్తున్నాను.

"ఏమిటి చేస్తున్నారు మీరు?" అంటూ తలుపు త్రోసుకుని

కుంటి కాలుతో ప్రత్యక్షమయింది నీలి. నాకు ఉక్రోషం వచ్చిన మాట్లా నిజమే—పళ్ళు పటపటా పిండుకున్నాను. నన్నిలా అటకాయించే ధైర్యమా?—ఎట్లా వచ్చింది? నీలి వికారంగా నవ్వుతో అంది—

"ఇంతకీ నాకు మెలకువొచ్చింది గనుక సరిపోయింది. ఈయన్ని యెక్కడకు చేరేద్దామని వచ్చార్రా మీరు నలుగురూ? జబ్బు మనిషని ముఖం చూస్తే తెలవటంలే....పోండి, పోండి, నిన్న రాత్రల్లా ఆయన వొళ్ళే ఆయనకు తెలీదు."

ఆ రిక్షావాళ్ళు నలుగురూ కొరకొరా నాకేసి చూశారు. అందులో వొకడు "వోరి పిచ్చోడు గావాల్నురా యీన—మాకు తెల్దు తల్లీ! ఈ బాబు మాటల్ను నమ్మి గాడీలో నాక్కెల్లినాము గాం. ప్రొద్దున్నె పోలీసోరు మక్కెలిరగ దన్నేసేవోరు. పదంర్రా మా గొప్ప బేర వేం...." అన్నాడు.

తిరిగి వాళ్ళు నాకు చెప్పుకునే అవకాశం కూడా లేకుండా జారుకున్నారు. నేను నిలువు నిలువునా కోపంతో దహించిపోతున్నాను. పిచ్చివాణ్ణా నేను? ఎదురుగ్గా అసహ్యమైన ముఖమేసుకొని భయం కూడా లేకుండా నవ్వుతోంది. చెంపలు తడుముకుంటే గరుగ్గా లోతుగా తగిలాయి. వెళ్ళి అద్దం చేతిలోకి తీసుకుని దీపంవద్ద వంగి ముఖం చూసుకుంటున్నాను. నల్లగా మసకమసగ్గా అలుముకొనిపోయి వుంది.

చెరగుతో నవ్వు నాపుకుంటూ నీలి "తప్పు. మీరు అద్దంలో ముఖం చూసుకోకూడదు" అంది.

నేనున్న పరిస్థితిలో నా మీద అధికారం కూడా చెలాయించే లాగుంది-వాఠెవ్వా!

"ఇల్లారా...పోనీ, నీ ముఖం చూసుకో దీంట్లో..." అని అద్దం ఆమె కెదురుగ్గా త్రోసి వెక్కిరించాను.

"నే నెప్పుడూ అద్దంలో నా ముఖం ఎట్లా వుంటుంది అని చూసుగోను. నన్నెవరైనా క్రొత్తగా చూసినప్పుడు వాళ్ళ ముఖమే నే నెల్లాగున్నానో అద్దం కన్నా స్పష్టంగా చెబుతుంది" అని వెళ్ళిపోతూ—

"మరి మీరు వె....ళ్ళి....మళ్ళీ....బ....ళ్ళ....వా....ళ్ళ....ను...." వాక్యం మధ్యలోనే నవ్వు వచ్చి తలకాయ పక్కకు త్రిప్పు కొంది. వెళ్ళి రెండుచేతులా ఆ యెముకల ప్రోగును గుంజిగుంజి నీకు మరీ ఖులాసా ఎక్కువైనట్టుందేమని అడగా లనిపించింది. నాకు వెంటనే జ్ఞాపక మొచ్చింది—సృష్టికర్త, ప్రకృతి కూడా వికలాంగు లకు అతి తెలివి తేటల్నిచ్చి బ్రతకమంటారని.

మళ్ళీ కాకులు కూయకుండానే నా గదిలోకి సిద్ధమై "లేస్తూనే నా ముఖాన్ని మీకు చూపించకూడ దనుకున్నాను కాని—" అంటూ దబ్బున నేల మీద చతికిలబడి నిన్నరాత్రి చిందర వందరగా గదినిండా పరిచిన సామాన్లు ఎక్కడిదక్కడ సర్దేస్తూ "రాత్రి మీరు గొడవచేసి నట్లు నే నెవ్వరికీ చెప్పలేదు. మా అమ్మకు కూడా—" అని తాను నాకు గొప్ప ఉపకారం చేసినట్లు, "చెప్పను లెండి" అంది నా వైపు చూస్తూ.

నిజంగా ముసలమ్మగారికి తెలిస్తే గోలవుతుంది. ఆ విషయం నాకు స్ఫురించనే లేదు. నీలి కేసి గుడ్లప్పగించి చూస్తూ పరున్నాను. ఆ కాలు వాళ్ళ అమ్మ ఆశించినట్లుగా బాగుచెయ్యగలరేమో డాక్టర్లు అని నాకూ అనిపించింది. పాపం, నీకు ఆ కెంపురంగు పరికిణీ వొక్కటేనా అని అడుగుదా మనుకున్నాను. మంచి చీరలు కొనిపెడ్తే....ఆ బొమి కల ప్రోగును మార్చడం ఎట్లా?—ఒక ఆరునెలలు పండ్లు, పాలూ, వెన్నా పెట్టి పెంచితే, అప్పుడు మరీ లావెక్కి యింతకన్నా అస హ్యంగా వుంటుందేమో? కాస్త వొంటికి కండపట్టాక ఫరవాలేదు. చూడ్డానికి నీలి తమాషాగా వుంటుంది. మరి ఆ మిణుగురుపురుగుల్లాటి కళ్ళు—వాటికి బంగారు ఫ్రేము కళ్ళద్దాలు తొడిగితే ముఖాన్ని కొంత వరకు కమ్ముతుంది. కొద్దిగా లిప్‌స్టిక్కు వాడాక పెదాలు దొండపళ్ళే అనిపిస్తాయి. తరువాత వో చిన్నపెట్టి బండీలో కూర్చోబెట్టి బండీలో కూర్చోబెట్టి కాన్వెంటు స్కూలుకు పంపితే—చాలామట్టుకు మంచి అమ్మాయల్లేనే అవుతుంది.

ఆ ఉదయం నేను రైల్వే డాక్టరు దగ్గరకు వెళ్ళి 'సిక్ రిపోర్టు' చెయ్యాలి. బిక్క మొహం వేసుకుని గుమ్మంలోని రిక్షాకేసే చూస్తూ

ముఖానికి చేయి అడ్డంపెట్టుకొని ఎండలో నిలబడ్డది నీలి.

"ఛా—నే నెక్కడికీ పారిపోను. వొట్టు! ఇంకెక్కడి కెళ్తాను- మరి నా కెవ్వరూ లేరు" అని నవ్వుతూ రిక్షా యెక్కాను.

నేను తిరిగి ఆసుపత్రినుంచి లోనికి అడుగుపెట్టేసరికి హోటలు క్రింద యేదో కొద్దిగా రభస—పై పెదవిని దుబ్బులా క్రమ్ముకొచ్చిన మీసాలను కొరుకుతూ హోటలు యజమాని మల్లయ్య "అబ్బ! నువ్వుండవే—" అంటూ గసిర్పాడు భార్యను. ఆవిడ ముఖంలో తుఫాను వెలిసే సూచన లెక్కడా కనిపించటం లేదు.

నేను చడీచప్పుడు గాకుండా మేడమెట్లు ఎక్కుతున్నాను.

"కన్న కడుపు యివ్వాళ నాకెంత మండిపోతున్నది? ఏమి తన కూతురేనా అప్సరస? తెలివి తక్కువతనానికి పిల్లను నాలుగు కూక లెయ్యాల్సినది పోయి తనూ వెర్రిపిల్లాడని అంటుందా? ఆ ముక్క అభిమానంగల నోట్లోంచి రావలసిందేనా? తెమ్మనండి. ఈవిడగారు యే కలకటేరో దిగి వచ్చి పెళ్ళాడుతా డనుకుంటోంది. కడుపులో యింతలేసి కుళ్లు ఆలోచన లున్నాయని—"

పైన వసారాలో దొప్పల్లాటి చెవులు, గ్రద్ద ముక్కు బాకాలాటి నోరు, క్రిందకు వ్రేలాడిపోతున్న లాగుతో ప్రత్యక్షమయ్యాడు వెర్రి పిల్లాడు. నన్ను చూసి కాలెగరేస్తూ మీద మీద కురకబోతుండగా—సర్వారు-

"ఇడుగో, నీలి మొగుడు బాబూ—" అని లాగి పట్టుకుని "చెప్పవయ్యా. ఏది? పెళ్ళాం వచ్చాక యేం చేస్తావ్?" అన్నాడు.

సరిగా అప్పుడే నీలి తాళం చెవులు యివ్వటం కోసం టక్కు టక్కు మని చప్పుడు చేసుకుంటూ వస్తున్నది పైకి.

వెర్రి పిల్లాడు గెంతుతూ "ఇహ్హీహీ!" అని తప్పట్లు చరుస్తూ నవ్వుతున్నాడు.

సర్వారు "నీలి పేరు చెబితే మురిసిపోతున్నాడు బాబూ—ఇక ఎంతోకాలం ఆగేట్టు కూడా లేదు" అన్నాక నీలి ముఖంలోకి చూశాను. ఎందుకో సుముఖంగా లేదు. అన్నట్లు ఆ రోజు వెలిసిపోయిన చిన్న

చిన్న పువ్వుల చీర కట్టుకుని తాటాకు బొమ్మలా ముస్తాబయింది. తలలో ఎప్పటి ఆ చిన్న ఎర్రగన్నేరు పువ్వే—

"వచ్చినాడా—" అంది సర్వరును.

వాడు పిల్లాణ్ణి నీలమ్మ మీదకు వుసి గొల్పి వదిలాడు. వచ్చి వాడు వంగి, చేతిని రెండుమార్లు అర్ధచంద్రాకారంగా వూపుతూ నీలి కొంగు దొరక పుచ్చుకుని లాగాడు. సాచిన చేతిని కసుక్కుమని గిల్లటం నేను చూశాను. ఆ సాహసుడు వెంటనే మీద బడి రెండు చేతుల్తో చుట్టివేయాలనుకున్నాడు యీ అబలను. నీలి ముఖం కంగారుతో నిండిపోయి వుంది. సర్వరు వికవికా ఫకాలుమని నవ్వుతున్నాడు. అంతే—విసురుగా చంకలోని కర్రతీసి కాలి మీద వేసింది. 'అమ్మో' అని యేడుస్తూ వాడు కాలు చేత్తో పుచ్చుకుని క్రిందకు దిగిపోయాడు. చూస్తూండగా చేతిలోని కర్రను విసిరేసి గోడమూలను దబ్బున కూలబడిపోయి చేతుల్తో ముఖం కప్పుకొని ఏడువ సాగింది. ఇంకా నేను వూరడిద్దామనుకునేలోపునే గాలివానలా వచ్చిపడింది మల్లయ్య భార్య.

"ఏడుస్తున్నావటే పైగా, చెట్టంత కుర్రాణ్ణి మోకాలి ముడుసు విరిగేట్లు కొట్టి. నీ చేతులు విరగ—సిగ్గులేని ముఖమా! మేనమామ కొడుకన్న గౌరవం యేమన్నా వుందీ? నా కొడుకు కాస్త అమాయకుడు గనుక కర్ర తిరిగేస్తావు, అవునా?"

"అది కాదత్తా—నా చెయ్యి పుచ్చుకు లాగాడు." నీలి గొణుగుతోంది. ఆవిడ బుగ్గలు నొక్కుకుంటూ "ఐతే....అందుకు తగట్టేవాడు. నీ వేమో రంభ ననుకొని కులుకుతున్నావులే—" అంది.

"నలుగురి యెదుటా మీదబడి అల్లరిచేస్తే నాకు అభిమానంగా వుంటుందత్తా!" పరుషంగానే అన్నది నీలి, చెరగు ముఖానికి కప్పుకొని కళ్లు రుద్దుకుంటూ.

"ఐతే నా కొడుకుని నలుగురి యెదుటా కర్రపుచ్చుకు వాయించావు నాకెంత అభిమాన ముండాలి? చెప్పుడు మాటలు వింటే బుద్ధులిట్లాగే వంకర త్రోవలు పడ్తాయి. మిమ్మల్ని కడుపుకట్టుకొని యింత వరకూ యీడ్చుకొచ్చాక యేకు మేకవుతారని కల గన్నామా?" అని ఆమె చేతులూపుకుంటూ నిష్క్రమించింది.

ఇలా రమ్మని పిలిచాను. నీలి నెమ్మదిగా ప్రాకుకుంటూ వచ్చి గది మధ్య బాసింపట్టు వేసుకు కూర్చున్నది. పాపం! చాలా బాగా యేడ్చినదల్లేవుంది-ముఖమంతా చారికలు కట్టివుంది.

నవ్వుతూ అన్నా—"పెళ్ళిచేసుకోమన్నారనేనా—అంత దుఃఖమూనూ? పోనీ....నాకుమల్లే వుండిపోతావా యేం?"

"కాదండీ....చూశారా యెంతలేసి మాటలన్నదో మా అత్త. మీరు చూస్తూనే వున్నారుగా. మేమేం ఇక్కడ వీళ్ళ నెత్తిమీద కూర్చొని వూరికే తింటున్నామా? మా అమ్మ, నేనూ అస్తమానూ గాడిపొయ్యి దగ్గర, దాసీదానిలా వుదయా స్తమానమూ కూరలు తరిగి, గదులన్నీ వూడిచీ, కూజాల్లోకి నీళ్ళు నింపీ చచ్చేచాకిరి చేస్తూంటామే? ఎంత అనాకారిగా పుట్టినా నాకూ రెండుచేతులంటూ యిచ్చాడుగా భగవంతుడు—"

రెండునిముషాలు నిశ్శబ్దంగా దొర్లినమీదట, చీర చెరగునుంచి దారపోగులు వెలికిలాగుతూ—"నాకు చదువు నేర్పుతారూ?" తల కాయ వాల్చి నున్నటి గచ్చుమీద చేత్తో వ్రాస్తూ అంది.

"ఏవిటీ? చదువా—" అని ఆశ్చర్యంతో నేను రెట్టించాను.

కాస్తంత సిగ్గుతో, "నాకు అక్షరాలుకూడా రావండి. చిన్నప్పుడు బళ్ళోకి పంపమంటే, కొట్టినంత పనిచేసి, మొగపిల్లాడు వాడికే లేనప్పుడు దీని కెందుకు చదువు? వూళ్ళేలాలా వుద్యోగాలు చెయ్యాలా అంటూ చాకిరీలోకి దింపేసింది మా అత్తే!"

నా యెదురుగ్గా కూర్చున్న తాటాకుబొమ్మ—అందంగా వుండాలనీ, మంచినగలూ చీరెలూ కోరుతుందనీ, అదృష్టాన్ని డబ్బునుగూర్చి కలలు గంటున్నదనీ అనుకొంటానుగాని చదువుకోవాల నుందని అంటుందనుకోలేదు.

చదువుకున్నవాళ్ళంతా యేం బావుకుంటున్నారు? మొదట్నుంచీ యిల్లాటి ఆశల్లో పెరిగినవాళ్ళు జీవితంలో భయంకరమైన కలలు కన్నారనీ, భౌతికమైన దృక్పథం అభిరుచులు ప్రాపంచికపు అలవాట్లలో మెసలి తయారైన మనుష్యులు సుఖంగా బ్రతకగలుగుతున్నారనీ చెప్పాలనుకున్నాను.

చేత్తో ఒక బొగ్గుతీసుకుని 'అ—ఆ—' అని నేలమీద వ్రాసి యిచ్చాను. చాలా సంతోషంతో నేను చెప్పినట్లు ఆ అక్షరాల్ని దిద్దుతూ మధ్యమధ్యను అవి బండబారిపోతూండటాన్ని అసంతృప్తితో గమనిస్తూ, మళ్ళీ తలెత్తి నా ముఖంలోకి చూసి—నేను చిరునవ్వు నవ్వగానే తలవాల్చి ఆ పొడుగాటి వ్రేళ్ళను బొగ్గుమసిలో త్రిప్పేది.

మధ్యలో నా కోసం బార్లీ నీళ్ళు పుచ్చుగునివచ్చిన ముసలమ్మగారు, బొగ్గుమసికేసి అర్థంకాని చూపొకటి విసిరి "యేవిఁటే చేస్తున్నావు ఇక్కడ?" అని ముఖం చిట్లించగా-

"చదువుకుంటోందండీ నీలి—" అన్నాను ముసిముసిగా నవ్వుతూ. ఆవిడ ముఖం వికృతంగా మారిపోయింది.

"నీ అత్త చూస్తే యింకేమన్నా వుందే—తిట్టిపోస్తుంది."

నీలికి చాలా పౌరుషం వచ్చినట్లు గమనించాను. శ్రద్ధతో ఆ రెండు అక్షరాలనూ దిద్దటం పూర్తిచేసి "యిహ వచ్చేసినట్లేనండి" అంది తృప్తిగా ఒక్కమాటు వెన్ను విరుచుకొని.

"చూడకుండా వ్రాయి-" అనటంతడవు గబగబా చేత్తో మసి బొగ్గును తుడిచేసి ఒక అక్షరం కొంతవరకూ వ్రాసి, ఆలోచిస్తున్న ముఖం పెట్టింది.

"నీ మొహం! యీ పద్ధతిని ఎన్నేళ్ళు పడుతుందే. నీకు చదువు వచ్చేసరికి—ఆ నేలంతా బొగ్గుమసి చేసేశావు. నీ చదువు పూర్తయేసరికి యీ గదీ గోడలూ యిల్లూ ఆవరణంతా బొగ్గుగీతలు మసితో కలకల్లాడిపోవలసిందేఁ?"

"నువ్వూరుకోవే అమ్మా!" అంటూ అరిచింది నీలి కోపంగా. ఈ ముసలివాళ్ళు ప్రతిదీ ఆక్షేపిస్తారు. అన్నింట్లో కలగచేసుకుంటారు. ఏదీ చెయ్యలేరు; కాని ఒకప్పుడు అన్నీ చేశామంటారు

నీలిని పూరిస్తూ "రేపు పలకా బలపమూ తెస్తాను నీ"కన్నాను.

ఆ పిల్ల 'అ—ఆ' వ్రాయటం పూర్తిచేసి నవ్వుతూ నా ముఖంలోనికి చూసింది.

"భేష్—" అని నేనూ నవ్వగానే "పలకవుంటే యింకా దబ్బునొచ్చేస్తాయి గదండీ—"అంది.

"ఆహా!" అని తల వూపాను.

ముసలావిడ శ్రుతిమించుతున్నట్లు గ్రహించినదై —

"నీకేమన్నా పిచ్చా అబ్బాయీ—లేక వాళ్ళ అత్త వేసే అక్షంతలు నువ్వుకూడా నాలుగు పంచుకుంటావా యేం?"

"చూడండి, మీ నీలిని లేడీని చేస్తాను" అంటూ వేళాకోళంగా నవ్వాను.

"ఎంత పిచ్చివాళ్ళురా మీరు!" అని గొణుక్కుంటూ మెట్లుదిగి వెళ్ళిపోయింది ఆవిడ.

నీలి వెనకాతలే నాలిక పంటితో నొక్కి వెక్కిరించేసింది. ఒకరి ముఖంలోకి ఒకరు చూసుకుని ఫక్కుమని నవ్వేశాము.

తిరిగి నాకు స్వస్థత చిక్కడానికి పదిహేను రోజులన్నా తీసుకొని వుంటుంది. ఉదయపు యెండలో నా గదిముందు వరండాలో రెండు మెత్తటి దిండ్లు నానుకుని నేనూ, రాసియిచ్చిన అక్షరాలు దిద్దుతూ చెరిపి వ్రాస్తూ నా శిష్యురాలూ—ఆమెలోని ఆసక్తినీ వుత్సాహాన్నీ చూస్తూ యెంతగానో మురిసిపోయేవాణ్ణి. ఎంత త్వరగా ఈమెకు అక్షరాలు వస్తాయి, ఎంత త్వరగా చదవటం వస్తుందీ—అప్పుడెంత గబగబా ఈమెకు యీ ప్రపంచము, ఇందులోని వింతలూ విశేషాలు బోధపరుస్తాను అనుకుంటూండేవాణ్ణి.

నా శిష్యురాలిని "కాలు బాగుచేయించుకుంటావా?" అని ఒకసారి అడిగాను. నేను ఇచ్చిన వాచక పుస్తకంలోని బొమ్మల్ని చూస్తున్న నీలి ఆత్రంగా "నిజంగా—నాకు కాలు వస్తుందాండీ?" అనేసింది.

'ఓహ్హో!' అని, ఆమెకు డాక్టర్లు బుర్రలు విడదీసి అతుకుతారనీ, కడుపులు కోసి రెండు ముక్కలుగా మళ్ళీ కుడతారనీ, ఎముకలు తీసి పారేసి దంతంతో చేసినవి మళ్ళీ చేతులూ కాళ్లూ తెప్పిస్తారనీ, వాళ్లు తల్చుకుంటే యేకీలు కాకీలు ఊడదీసిపెట్టి మళ్ళీ మనిషిని చేసేస్తారనీ అద్భుతంగా వర్ణించి చెప్పాను. అ విధంగా నీలికి కాలువచ్చే ఆశ, ఆ అమాయకురాలైన ముసలి తల్లికి కూతురు పెళ్ళి ఆశా—రగిల్చి పుణ్యం గట్టుకున్నాను.

నేను మళ్ళీ డ్యూటీలో చేరటంతో ఆమె చదువు వెనకట్టేసింది. ఈమారు పగలు డ్యూటీ. నా భోజనం స్టేషనుకు హోటలు కుర్రాడే తెస్తూండేవాడు.

బాగా పంద్రెండు గంటలయింది. లైనుమీద బండీ ఫారం (form) చేస్తున్నాను. ఈ మధ్యలో దూరాన చెట్లకింద పోర్టర్లు గుంపుగా ప్రోగడి గొడవ చేస్తున్నారు. ఏ దరిద్రుడైనా షంటింగులో కాలూ చెయ్యీ విరగ్గొట్టుకున్నాడేమోనని అటువైపు పరుగెత్తాను.

ఆ గుంపు మధ్యలో ఎర్ర పరికిణీ, యెండగొట్టిన ముఖమూ, కుంటికాలు, చేతిలో కారియరుతో నీలి నిల్చుని వుంది. నన్ను చూడ గానే వాళ్ళ వెకిలినవ్వులన్నీ కట్టడిపోయాయి.

"ఎందుకొచ్చావ్ ఇట్లా....?" అని కొంచెం కోపంగానే అన్నాను.

"ఇవ్వాళ నౌకరు కుర్రాడు రాలేదు. మీరు అన్నం తినకుండా ఉంటారనీ...."

"చాలా గొప్పపని చేశావ్—ఇంజన్లూ, బళ్ళూ ఇట్లా తిరుగు తూంటే ఈ పట్టాల్ను బళ్ళను తప్పించుకోగల్ననే వచ్చావా? ఇంకా నీ పుణ్యం బాగుంది. నేను చూశాను కాబట్టి...."

నీలి కళ్ళలో నీరు తిరుగుతుండగా "ఇంకెప్పుడూ ఇల్లాటిపని చెయ్యనండీ" అంది జాలిగా.

"సరే—పద." రెక్క చేత్తో పుచ్చుకుని జాగ్రత్తగా పట్టాలు దాటించి ఎదురుగా కనుచూపు మేరలో పొట్టి మామిడి చెట్టు పచ్చడి గడ్డి—ఆ నీడలో అక్కడా అక్కడా ఎండ తళుక్కుమని మెరుస్తూం స్తుండగా ఇద్దరం అక్కడ చతికిలబడి అన్నపు గిన్నెలు నేల మీద పరిచాము.

పోర్టరు పరుగెత్తుకెళ్ళి కూజాతో నీళ్ళు తెచ్చాడు.

నేను అన్నం కలుపుకుని తింటూ నీలికోసం చల్లటి షర్బత్తు తెప్పించి ఇచ్చాను. నెమ్మదిగా షర్బత్తు పీలుస్తూ మధ్య మధ్యను మిస మిసలాడిపోతున్న ఎండలోని తెల్లటి మేఘాన్ని ఆశ్చర్యంతో చూస్తున్నది నీలి. రెండు నల్లటి కాకులు వొకదాన్నొకటి పొడుచు కుంటూ క్రిందుగా మా తలల మీద పల్టీలు కొడుతున్నాయి. దూరాన

యెక్కడో కుక్క మొరుగుతున్న ధ్వని షంటింగు ఇంజను చప్పుడులో కలిసిపోయింది.

"చూశావా ఆ లైను మీద నిలబడివుండే రైలు — దాన్ని ఇప్పుడే తయారుచేశాను" అన్నాను నవ్వుతూ.

"ఆహా!" అంది ఆశ్చర్యంగా నా చేతులకేసి చూస్తూ.

నా ప్రజ్ఞకు నీలి చాలా సంతోషించిందల్లే వుంది. తీసుకెళ్ళి మళ్ళీ వద్దంటున్నా రిక్షాలో కూర్చోబెట్టి హోటలుకు పంపించేశాను. ఆ రోజు నాకు కొంచెం గర్వం వేసింది—నేను అన్నం తినకుండా పోతానేమో అన్న ఆందోళనతో నా కోసం ఒక ప్రాణి వెతుక్కుంటూ రావటమనేది.

ఆ విధంగా నీలే వెర్రి పిల్లాడికి నామీద విరోధం కలగటానికి కారణమయింది. ఉన్నట్టుండి ఒకరోజున నా గదిలోకొచ్చి, తోసేస్తున్నా మీద మీదకురికి, చేత్తో నా చొక్కా పీకి చించేశాడు. నేను చేయెత్తగానే బల్లమీద బోర్లించిన గ్లాసును రోజూ ముఖం చూసుకునే అద్దాన్ని నా మీదకు గిరాటుపెట్టి పారిపోయాడు. తరువాత నే నా పిల్లవాడి బారినుంచి చాలా తప్పించుకు తిరగాల్సి వచ్చేది. ఏమాత్రం యేమరివున్నా నా మీదబడి కరవటానికిగాని, బట్టలు పీకటానికిగాని సిద్ధమయ్యేవాడు. పులిలా వాడి కళ్లు నన్ను చూడగానే జిగేలు మనేవి. నోరంతా తెరిచి పళ్ళన్నీ బిగబట్టేవాడు. కాలును నేలకు రాసి ధనామని దగ్గరున్న బల్లనో కుర్చీనో తన్నేవాడు.

క్రమేపీ హోటల్లో అంతా—నీలీ నేనూ ముసలమ్మగారు వొకటీ అన్న అభిప్రాయంలో కొచ్చేశారు.

నేను హోటలుకు వచ్చి దాదాపు మూడు నెలలు పైబడినా యజమాని మల్లయ్యకూ నాకూ సన్నిహితత్వం యేర్పడలేదు. ఇద్దరం ముభావంగానే వుంటూ వచ్చాము.

"పంతులుగారూ! చిన్నమాట" అని ఆ రోజు తానే స్వయంగా కాఫీ కలుపుకొచ్చి 'పుచ్చుకోండి' అని నా ముందు ఉంచాడు.

చీకటి పడబోతోంది. మామూలుగానే మల్లయ్యా హోటలు ఖాళీగా

ఉంది. సర్వర్లు కూడా ఏ వీధి అరుగుల మీదో కూర్చుని బాతాఖానీ కొడుతుంటారు. అతను నెమ్మదిగా ఉపక్రమించాడు.

"ఎవరు మర్యాదస్తులో యెవర్ని నమ్మకూడదో నేను ఇట్టే పోల్చెయ్యగలను."

నేను తాపీగా కాఫీ గ్లాసు పెదిమలకు తాటించి చెప్పమన్నట్లు చూశాను.

"పాపం, ఇటీవలే జబ్బుపడి లేచారు. మీ వంట్లో యిప్పుడు మామూలుగా ఉంటోందా?"

"డ్యూటీ చేసుకుంటున్నాను" అని నాలుగు వైపులా ఒకమారు చూసి సిగరెట్టు ముట్టించాను.

మల్లయ్య మీసాల క్రిందనుంచి నవ్వాడు.

"ముసలమ్మగారు నాకు జబ్బు చేశాక సిగరెట్టు ముట్టుకోవద్దని ఆంక్షవేసి నీలిని కాపుంచింది లెండి. అందుకని—"

"మీకైతే దాని అంగరక్షలకు ఎలా చిరాకు రావటంలేదో నాకు మట్టు కాశ్చర్యంగానే వుంది సుమండీ—"

మా ఇద్దరిమధ్యా సిగరెట్టు పొగ చిన్న మేఘంలా లేచి అడ్డుకుంది.

మల్లయ్య అందుకున్నాడు. "మా అక్కయ్య యీ కుటుంబ వ్యవహారాలు సందర్భమూ కొంత మీకూ చెప్పే వుంటుంది లెండి."

నేను ఇరుకునపడి ఏమంటే ఏం ప్రమాదమోనని ఆలోచించు కుంటున్నాను.

"దాని డబ్బు కూడా సుమారు మూడువందల చిల్లర నా దగ్గ రుంది లెండి. మా నీలికి మూడేళ్ళప్పుడు, భర్త పోగానే వచ్చేసింది. చెప్పే ఉంటుంది మీకు."

అతి కష్టంమీద 'హా!' అనగలిగా.

"నీలికి కాలు బాగుచేయించాలని కూడా అని ఉంటుంది లెండి."

తలకాయ ఊపాను.

"అసలు నేనే ఆ పనికి పూనుకున్నాను. ప్రతిమాటూ ఏదో విఘ్నమే. నా భార్య నీలికి కాలు బాగుచేయిస్తే వాళ్ళ అమ్మ మరో

సంబంధం చేస్తానంటున్నది అని గొడవపెడుతుంది. దాని దుగ్గయే మంచే, తెలిసిన మేనత్తే తన అనాకారి పిల్లను యివ్వటాని కిష్టపడక్క పోతే యిక యెవరిస్తారు గనుక ఆలోచించమంటుంది."

పులిలా గ్రుడ్లు పెట్టుకుని అద్దాల గాజు గ్లాసులు మీదకు విసిరే ఆ వెర్రి పిల్లాడి పెళ్ళి వ్యవహారం నా మెడకు చుట్టుకోబోతున్నది. ప్రపంచంలో యిద్దరు రూపవంతులైనవారికి వివాహం కావటమూ అతి కష్టం మీదనే జరుగుతోంది. ఇద్దరూ అనాకారులు, రూపహీనులైన వాళ్ళకు వివాహం కావటమూ కష్టతరంగానే పరిణమిస్తోంది. ఏం చిత్రం?

"మీరు చెప్పి చూడండి. ప్రస్తుతం నా భార్య దగ్గర కొంత పైకం ఉంది. నీలికి వైద్యం ఆరంభించవచ్చు. ఆడవాళ్ళ నోరు నొక్కిపట్టి అణచి మనం యేం సాధించగలం చెప్పండి? నా భార్య మట్టుకు సవబు లేకుండా అడగటంలేదు. అభిప్రాయాలు మనకైతే లక్ష ఉండొచ్చు. చూడండి, ఇతరుల ఉద్దేశాల్ని కూడా మన్నించాల్సి వుంటుంది."

"అవును లెండి. నేను కూడా తప్పకుండా చెప్పి చూస్తాను" అని లేచి నెమ్మదిగా మేడమీదకు జారుకున్నాను.

అయ్యో—వాళ్ళ బ్రతుకులు అట్లా గడపనియ్య కూడదా—యీ కలపాలనే తాపత్రయం యెందుకు? నా మట్టుకు ఎంత ఆలోచించినా నీలిని కుంటిపిల్ల గదా అని వెర్రి పిల్లాడి కిమ్మనడంలో సవబేమీ కనిపించలేదు.

మరునాటి ఉదయం మెట్ల దగ్గర నవ్వుతూ పలకరించింది యెల్లప్పుడూ ధుమధుమలాడుతున్నట్టుండే ముఖం గల మల్లయ్య భార్య కూడా. ఏవో ఆశలు చిలుకరించుకొని నవ్వే ముఖాల మాటున ఆలోచనల కారు మేఘాల గుబురులో చిక్కడి నే నొక్కడ్నే ఆలోచించుకో సాగాను. ఈ మనుష్యులు యేమేమో అనుకుంటారు. ఏవేవో ఆశలను పెంచుకొంటారు. కాని వాట్ల సాధనలో యిరుకునపడి నలిగిపోయే చిన్నచిన్న హృదయాలను గుర్తించి కనికరించటమనేది యెప్పటికి అలవర్చుకుంటారు?

రెండు పచ్చకాగితాలను చేత్తో పుచ్చుకొని వచ్చి—"నాయనా, మీరీ వుపకారం చెయ్యాలి. ఆడకూతుర్ని నోరు తెరిచి అడుగుతున్నాను. మా నీలికి కాలు బాగయే సదుపాయం మీ చేత్తో కానిచ్చినట్లయినా ఎంతకన్నా సంతోషిస్తాను" అంది మల్లయ్య భార్య.

తరువాత నేను డాక్టర్ను కలుస్తానని మాట యిచ్చి, నాకు తెలియకుండానే మధ్యవర్తిత్వం నెత్తిన వేసుకుని, ఆ మర్నాడు ఆసుపత్రిలో నీలిని చూపించాలని నిశ్చయం చేశాను.

ఆ రోజు రాత్రి బాగా ప్రొద్దుపోయాక గదికి చేరుకొని పడుకునే యత్నంలో వుండగా కామోసు—నీలి తలుపు త్రోసుకుని వచ్చి మూగ దేవతలా తలకాయ వొంచుకుని నిలబడిపోయింది. తలెత్తి చూశాను. టప్పు టప్పుమని కన్నీరు చింది నేలమీద పడుతోంది. లాంతరు వొత్తి పెద్దదిచేసి చేత్తో పుచ్చుకుని లేచాను.

దగ్గరగా వెళ్ళి "ఏం కావాలీ? చెప్పవ్—" అని ఆమె చేయి పుచ్చుకుని మృదువుగా అడిగాను.

మళ్ళీ ఎర్రపావడా కట్టుకుంది. తల్లో చిన్న గన్నేరు పువ్వు.... గాజులు కదులుతూ సన్నగా ధ్వనిస్తూండగా "మేం ఇక్కడ్నుంచి వెళ్ళిపోతామండి" అంది.

"ఏం?" వులిక్కిపడి అన్నా.

"మా వూరుపోతే అమ్మా నేనూ యెక్కడైనా పనిచేసుకునన్నా బ్రతకగలమండీ."

"వోహో! అవశ్యం వెళ్ళొచ్చు. అల్లా తిన్నగా వెళ్ళిపోక మళ్ళీ యిక్కడకు ఎందుకొచ్చావ్?" నేను నవ్వేశాను.

నీలి చెక్కిళ్ళు కాస్త సిగ్గుతో యెరుపెక్కాయ్.

"ఐతే నేను రేపు డాక్టరుగార్ని కలవనక్కర్లేదు. ఇంక ఆసుపత్రి కెందుకు వెళ్ళటం?...."

"వొద్దండీ. అంత డబ్బు మా కెక్కడ్నుంచి వస్తుంది గనుక?"

"పోనీ నా డబ్బు నా కిచ్చేస్తావా? నేను పెట్టుబడి పెడతాను నీ కాలికి."

"వద్దండీ. మమ్మల్ని వెళ్ళిపోనివ్వండి. నాకు భగవంతుడే చాలా

అన్యాయం చేశాడు. మిగలినది ఆ పిల్లాడిచేత పసుపుకొమ్ము ముడే యించి మా అత్త పూర్తిచెయ్యాలని చూస్తోంది."

"ఐతే మరి నాలాగే పెళ్ళిచేసుకోకుండా వుంటావా యెప్పుడూ?"

"కాలు వస్తే మట్టుకు నేనెందుకు పనికివస్తానండీ?"

"పోనీలే - నువ్విట్లా రా."

నీలి దగ్గిరసా వచ్చి నిలబడింది.

"ఆవాళ గది ఖాళీచేస్తానన్న రోజున రాత్రికిరాత్రి నలుగురిలో చెట్టంత మనిషిని పిచ్చివాడిక్రింద ఛెలామణీచేసి యిప్పుడు నాతో నిమిత్తం లేకుండా ఎక్కడికి పారిపోదామని చూస్తున్నావ్?" అని చేతులు రెండూ పుచ్చుకున్నాను.

విదుల్చుకొంటూ "మీకు కోపం వచ్చిందల్లే వుందే?" అంది.

"ఆహా! రాదా మరి-" అని లోనికివచ్చి ప్రక్కమీద వొత్తిగిల్లాను.

కిటికీతలుపులు బార్లా తెరచివున్నాయి. దూరాన నక్షత్రాలు స్పష్టాస్పష్టంగా మెరుస్తున్నాయి. హృదయం తేలిగ్గా వుంది. ఒక అల్పజీవికి బ్రతుకుమీద బ్రహ్మాండమైన ఆశను రగుల్కొల్పాను. పైకనలేక పోతున్నదిగాని అందరాడపిల్లలకు మల్లే మనస్సులో మంచి మొగుడ్ని దాచుకుని, ఆ మిణుగురు పురుగుల్లాటి కళ్ళతో తనివితీరా చూస్తూ, పుడకల్లాటి చేతుల్తో చుట్టేసుకుని యీ నలిగిపోయిన హృదయాన్ని నైవేద్యం చేద్దామని నీలికూడా ఆశిస్తూండవచ్చు. వెర్రిపిల్లాడి అయోమయ దృక్కులు ఆ బాలిక హృదయకవాటాలను ఫిరంగి గుండ్లతో పేల్చినట్లు కాగా, పాపం, ఆ బాధనుంచి ఎట్లా తప్పుకోగలదు? అయ్యో! అర్భకురాలు.... నిస్సహాయజీవి!—నేనో, నా రోజారంగుపిల్ల యేమైంది? పాలమీగడ కుచ్చెళ్ళు, చిన్నగులాబీ వన్నె లేతపాదాలు—కంపించే పెదాలతో మళ్ళీ వొక్కమాటు—ఎట్లాగున్నానో అని నన్ను చూడ్డానికి రాకూడదూ? నాకు రెక్కలొచ్చాయి గాలిలో పైకిలేచాను. చెట్లమీదనుంచి పరుగెత్తాను. అల్లా ఎగురుతూ సంద్రాల్ని దాటాక అడవుల్ని చూశాను. పెద్దపెద్ద పట్టణాలు భవనాలు వనాలు అన్నీ గాలించేశాను. వృధా—యేడుస్తూ అలసిపోయి హోటల్లోని గదిలోకే వచ్చిపడ్డాను. నా హృదయం లోప

లంతా శూన్యం—అరణ్యం భగ్గున మండితే చూడాలనిపించింది. త్రాచు పాము పట్టుకుని పీకితే హాయిగా వుంటుందేమో—బండరాళ్లను వేసి తల బ్రద్దలుకొట్టుకున్నా బాగుండుననిపించిందాయె! లాభంలేదు. సుఖమూ సంతోషమూ నువ్వు యితరులకు యివ్వాలిసిందే గాని నీ కెవ్వరూ యివ్వరు. అదృష్టం లేదనుకుని గట్టిగా హృదయకవాటాలు మూసేసుకుని 'నాకేమీ అక్కర్లేదు. నేనే అందరికీ యివ్వాలి' అని బిగ్గరగా చాటుకున్నాను.

గుండెలు చేత్తో పుచ్చుకుని తడబతూన్న కాళ్ళతో నీలిని వెంటేసుకుని పెద్ద డాక్టర్ను కలిశాను. నా ప్రాణాలు బితుకు బితుకుమంటున్నాయి. డాక్టర్ల ప్రజ్ఞనుగురించి చాలా కోతలు కోసినందుకు నొచ్చుకున్నాను. ఐదు పదీ కాగితాలు సమర్పించుకుని బ్రతిమాలాను; డాక్టరు ముఖం చిట్లించాడు. నీలికికూడా భయంగానే వుంది. ఆ వికారమైన నీలికేసి అదేపనిగా చూశాక, అంగ్లంలో—"లాభంలేదు. ఈ పిల్ల తట్టుకోలేదు. చాలా పెద్ద అపరేషనుచేసి బొవిక మార్చాలి. అప్పటికీ ఆ కాలు నడవటానికి మాత్రం వుపకరించవచ్చు" అన్నాడు.

వెళ్ళి ముసలమ్మగార్ని తీసుకొచ్చాను. ఆవిడ డాక్టరు కాళ్ళావేళ్ళాపడి "బీదవాళ్ళం—పిల్లకి పెళ్ళికావాలి. కాలులేందే యెవరు చేసుకుంటారు బాబూ!" అని చెప్పుకుంది.

డాక్టరు పక్కుమని నవ్వేశాడు. ముసలమ్మగారు ఆయన బూటు కాళ్లను రెండుచేతులతో పట్టుకోబోయింది. గోడవారను నిలబడివున్న నీలి చెంపమీద చిన్న దెబ్బవేసి "నీకూ పెళ్ళా....వాహ్హో! ఐతే అవశ్యం నీకు కాలు యివ్వాలిసిందే—" అని నవ్వేసి వెళ్ళిపోయాడు.

నీలి అచ్చం పెళ్ళికూతురిలానే సిగ్గుపడ్డది. ముసలమ్మగారి ముఖం చింకి చేటంతవడంకూడా గమనించాను. అరచేతిలో చేయివేసి నలుపుకుంటూ 'డాక్టరు బాబు చాలా మంచివారే—' అని వొకమారుగాదు పదిమార్లు వల్లించుకున్న దావిడ. ఆ రోజే సర్జికలు వార్డులో నీలిని చేర్పించటం జరిగింది. మేం తిరిగివచ్చేసరికి మల్లయ్యా, భార్య, నవుకర్లు—వెర్రిపిల్లాడు అంతా పరంగుల మెట్లమీది బొమ్మల్లా చూస్తున్నారు. "చేర్పించేశారా?—" మల్లయ్య మీసాలు కొరుక్కుంటూ అడి

గాడు. నీలిని యెత్తుకొనిపోయి దాచేశానని వెర్రిపిల్లాడు కోరచూపులు చూస్తున్నాడు.

"వారే—డాక్టరు యెంత మంచివారనుకున్నావ్? నీలికి తప్పకుండా కాలు తెప్పిస్తానన్నారు". అంటూ చెప్పింది ముసలమ్మగారు.

ఆ మధ్యాహ్నం మల్లయ్యభార్య కొడుకును తిడుతోంది.

"వెర్రివెధవా—నీ కెందుకురా యింత మమకారం? అది కన్నబిడ్డం లేదని తిండి తినకుండా ఛస్తావా? వొక్కచోట పెరిగామే అన్న అభిమానం దానికి లేకపోయింది."

వాడు అస్తమానూ హోటలంతా కలియ తిరిగి అందరి గదుల్లోకి తొంగిచూసి మళ్ళీ వీధిలోకొచ్చి వొకమారు చూశాక లోనికి పోతూండేవాడు. ఆ అమాయక హృదయం ఎంతగా దహిస్తున్నదీ నేను గుర్తించాను. ఆ పిల్లాడు క్రమంగా అనుకోనంత చిత్రంగా మారిపోయాడు. గంతులు, డబ్బాలు-గ్లాసులు తిరగదొయ్యటం, తన్నటం లాటిచేష్టలు మానేశాడు. ఏదో మూల బల్లిలా గోడను అంటుకుని మూగగొడ్డులా కుమిలిపోవటం చూశాను. ముసలమ్మగారుగాని, నేనుగాని ఆసుపత్రికి వెళ్ళేటప్పుడు వచ్చేటప్పుడు చూసినట్లయితే, రెండు చేతుల్తో ముఖాన్ని కప్పుకుని ఏడ్చేవాడు.' మీరే వాడి దుఃఖానికి కారణ' మన్నట్టు చూసేది మల్లయ్యభార్య. ఒకమారు వాడ్ని రెక్క చేత్తో పుచ్చుకుని లేవనెత్తి 'రా బాబూ! నీకు నీలిని చూపిస్తాను' అంటోంది, వాడు వెంటబడుతూండగానే ఎక్కడ్నుంచి చూసివచ్చి పడిందో తల్లి-వొక్క విసురున వాడిని త్రోసేసింది. ఎట్లాగో తల్లిని త్రోసి తప్పించుకుని వాడు వీధిలో కురకబోతున్నాడు. ఏవిటంటూ మల్లయ్య ప్రక్క తలుపు త్రోసుకుంటూ వచ్చాడు.

"చూడండి. ఈ సిగ్గులేని వెధవ పడిపోతున్నాడు, ఆసుపత్రికంటూ-"

అతను చూస్తూండగా వొంటికాలుమీద లేచాడు; ఒకప్రక్కగా నిల్చుండి బిత్తరచూపులు చూస్తున్న ఆ చేటచెవుల గ్రద్దముక్కు కొడుకు మీద. తన్నగా ఫెడీల్మని వాడు లుంగలు చుట్టుకుని నేలమీద పడ్డాక కూడా, మల్లయ్య లోని పశుత్వమంతా విజృంభించగా చేతులతో

కాళ్లతో చితక బాదుతున్నాడు. కేరియరు విసిరేసి ముసలమ్మగారు అడ్డు పడపోయి సాధ్యం కాక 'చంపకురా—వాడ్నెందుకు—చంపకురా!' అని అరుస్తోంది యేడుస్తూ. నిష్కారణంగా చచ్చిపోతాడేమో ననిపించి గబగబా మధ్యకు వెళ్ళి మల్లయ్యను బలంగా నెట్టి కుర్రవాడ్ని లేవ నెత్తాను.

"వుండవయ్యా....నువ్వు. శనిగొట్టు వెధవ. చచ్చాడన్నా కాదు."

పిల్లాడు పూర్తిగా సొమ్మసిల్లాడు. వీపు డోక్కుపోయి నెత్తురు కారుతోంది. రైలుపట్టాల క్రిందపడి నలిగిన గొడ్డు, కారుక్రిందపడ్డ కుక్కలా వున్నాడు.

ముసలావిడ తమ్ముడ్ని నోటికి వచ్చినట్లల్లా తిట్టేసింది అవ్వాళం ఈవాళ చేస్తాను రేపు చేస్తాను అంటూ డాక్టరు నెలరోజులు గడిపాడు నీలికి ఆపరేషను. ఒకరోజు ఆలస్యమైతే ఒకరోజు పెళ్ళి వెనక్కు పోయినట్టుగా ముసలమ్మగారు లెక్కలు కడుతోంది. ఈ నెల్లాళ్ళలోనూ అద్భుతంగా మారిపోయింది నీలి. చిక్కటిపాలు త్రాగుతూండటంచేత శరీరానికి కాస్త మిసమిసలు వచ్చాయి. డోక్కుపోయినట్లుండే చెక్కిళ్లు కోలముఖం కాస్త గుండ్రంగా తయారయింది. నడుం దగ్గర్నుంచి చూస్తే మనిషి బంతిలాగయింది. నవ్వినప్పుడు కాస్త ముఖం చూడా లనిపిస్తోంది. పెదాలు ఎరుపెక్కాయి.

నా సంతోషం యేమని చెప్పుకోను!

రోజూ చిన్న చిన్న బహుమతులు పట్టుకెళ్ళి యిస్తూ వచ్చాను. రిబ్బనులు, జడపిన్నులు, పూలు, రకరకాల గాజులు—వొక టేమిటి, నాకు తోచిందల్లా కొనుక్కెళ్ళి- ఆమె ముందు కుప్పగా పోసేవాణ్ణి: హృదయం దగ్గర్నుంచి ఆఖరికి జడపిన్నువరకూ యేదన్నా యితరులకు యివ్వటంలో యెంత ఆనందం వుందో అప్పటివరకూ నాకు తెలీనే తెలీదు. ఇంకా ఆ కళ్ళు రెండూ వికారంగానే వున్నట్లు తోచాయి. సాయంత్రాలు ఆసుపత్రి వరండాలో బల్లమీద కూర్చుంటే-చల్లటిగాలి, యెదురుగుండా జాగ్రత్తగా పెంచిన చిన్నతోట, దాంట్లోని పచ్చటి రక

రకాల మొక్కలు, అస్తమించే సూర్యబింబం, ఆకాశంలోని రంగు రంగుల పిట్టలు కనిపించేవి.

నీలి సిమెంటు బల్లమీద, ఎదురుగుండా గడ్డిలో నేనూ ముసలమ్మగారూ కూర్చొని కబుర్లు చెప్పుకునేవాళ్ళం. అప్పుడప్పుడు ఆ వూతకర్రను గడ్డిలో దాచేసి తమాషాలు చేసి, నీలిముఖంలోని ఆత్రతకూ నిస్సహాయతకూ నాలో నేను నవ్వుకునేవాడ్ని.

"ఏమండీ, నీలికి కాలువస్తే తప్పకుండా బాత్‌రూం శాండిల్స్ కొనికొట్టాలండీ" అన్నా.

"అంతే....?" అని అమాయకంగా అడిగింది నీలి.

ఆమెకేసి చూస్తున్నవాడ్ని చప్పున నా జేబులోని చలవ కళ్ళజోడును తీసి బలవంతాన ఆమె ముఖానికి తొడుగుతూ— "చూడండి. మీ అమ్మాయి లేడీలా లేదూ?" అన్నాను.

నీలి చేత్తో అద్దాల్ని తీయబోయింది.

"చెబుతున్నా....తీశావా మళ్ళీ నీకూ నాకూ పేచీ వస్తుంది"అని గసిరాను.

"అమ్మా, మరైతే అద్దం తెచ్చిపెట్టవే. ఎట్లాగుందో చూసుకోవాలి" అంది.

ముసలమ్మగారు నవ్వుతూ లేచింది.

"నా ముఖం ఎట్లావుందో యెదురుగుండా వున్నవాళ్ళ ముఖమే అద్దంకన్నా స్పష్టంగా చెబుతుందన్నావుగా-మళ్ళీ అద్దం ఎందుకంటూ" ఎత్తిపొడిచాను.

"నిజమే. నిజమేనే—అమ్మా! అద్దం అక్కర్లేదే...." అని గట్టిగా కేకపెట్టింది ముందుపోతున్న తల్లికి వినపడేలా.

అంతలో హఠాత్తుగా మలుపుతిరిగి వస్తూన్న డాక్టరు చలవ అద్దాలు పెట్టుకున్న నీలిని ఆశ్చర్యంతో చూసి ఆగి "ఏవమ్మాయ్? చాలా ఖులాసాగా వున్నావే?" అని నవ్వాడు.

నేను నమస్కరించాను. కంగారుగా కళ్ళద్దాలు వూడదియ్యబోయింది కాని ఒకప్రక్క జుట్టులో చిక్కడంచేత నేనే ఆమెకు సాయం చేయవలసివచ్చింది.

"మీరిద్దరూ యేమవుతారు?" అని డాక్టరు నీలిని అడగ్గానే నేను తెల తెలపోయాను. నాకేసి చూసి నీలి తల వాల్చేసింది. అద్దం పుచ్చుకుని వస్తున్న ముసలమ్మగారు 'డాక్టరు బాబూ దండ' మంటూ చేతుల్ని జోడించింది. ఆయన ముందుకు అడుగులువేస్తూ 'పెళ్ళికొడుకు దొరికాడా?' అని ప్రశ్నించాడు నవ్వుతూ.

"ఏదిబాబూ, తమరు కాలు ఇచ్చాక కదా దాని అదృష్టాదృష్టాలు బయటపడేది?" అని ముసలమ్మగారు చెప్పింది.

ఆమెకేసి చూసినంతసేపూ ప్రశ్నించుకున్నాను—ఈమె నాకేం కావాలని? నీ....లి....నా....కే....మీ....కా....దు. ఈ మిసమిసలాడే పిల్లా, వెనుకటి ఆ వికారమైన రూపూ, రోజారంగు పిల్లా-ఏదీ సత్యం కాదు. ఇహనుంచి ఏం చేసినా నిష్కామ కర్మగానే చేయాలనే తీవ్ర నిర్ణయాని కొచ్చేశాను. మునుపు చిన్నపిల్లతో ఆటలాడినట్లుగా కేరింతలు కొట్టినట్లుగా ఉండటం మానేశాను. దూరంనుంచే మంచి చెడ్డలు యోగక్షేమాలు కనుక్కొని వెళ్ళిపోతూండేవాణ్ణి. తగినంత అవసరం వస్తేగాని చనువుగా నీలిమీద చేయి వెయ్యనని తీర్మానించుకున్నాను కూడా. ఈ మార్పు నాలో పసిగట్టాక నీలికి నా యెడల భయభక్తులు మరీ హెచ్చాయి. చూడగానే చేతులు జోడించి దండం పెట్టడం ప్రారంభించింది. చనువైన స్నేహితుడిగా మెసలిన నేను క్రమంగా గౌరవప్రదమైన స్థానాన్ని ఆమెలో సంపాదించుకోవటంతో మా మధ్య కొంత అంతరం ఏర్పడింది. దానితో మనిషికూడా దిగాలు పడ్డట్లు కనిపించేది.

ఆపరేషన్ చేసేరోజు దగ్గరకు వచ్చింది. ఆ రోజు నా గంభీర ముద్ర యావత్తూ పటాపంచలు కావలసిందే. కాని—అదృష్టవశాత్తూ మల్లయ్యా, భార్యా కూడా వచ్చారు. ఆపరేషను రూంలోకి తీసుకుని పోయేముందు నీలి కళ్ళనీళ్ళు బెట్టుకుని అంతసేపూ నా ముఖంలోకే చూస్తోంది. ఏమో చెప్పాలనుంది, కాని ధైర్యం చాలటంలేదు.

"నీ కేమీ భయంలేదు నీలీ, తుడుచుకో చెంపలు—" అని సర్ది చెప్పాను, కాని నాకు కాళ్ళు అడ్డంలేదు. నే నెప్పుడూ ఇలాంటి అవస్థలో చిక్కడలేదు. మల్లయ్యా, భార్యాకూడా దగ్గరకువచ్చి చేత్తో తిట్టి-'భయంలేదే. డాక్టరుబాబు చాలా మంచివారు' అని ధైర్యం చెప్పారు.

ముసలమ్మగారు గుండెను రాయి చేసుకుని బల్లమీద కూర్చున్నది.

నీలి ఇంకా అసంతృప్తిగా చూస్తూండడంచేత నేను స్ట్రెచర్‌తో విధిగా ఆపరేషన్ థియేటరువరకూ వెళ్ళాను. డాక్టరు 'ఏడవకమ్మా- నేనేం చేస్తానో నీకు చీమకుట్టినట్లుగాకూడా తెలీదు' అని నవ్వాడు. అట్టం డరు నన్ను సన్నటి దారిలా వున్నచోట చిన్న బల్లమీద కూర్చోమని నీలిని లోపలికి తీసుకెళ్ళిపోయాడు.

"యీ నరకంలోనికి త్రోయటానికే యీ పిల్లకు కాలు వస్తుం దనే ఆశ కల్పించానా" అని బాధపడ్డాను. అరగంట పోయాక బేసి నుతో నెత్తురు నీళ్ళూ తుక్కూ పుచ్చుకుని ఒక నౌకరు యీవలకు రావటం చూశాను. నా కళ్ళు చెదిరాయి. నేనేం చేశాను? ఒక అమా యకురాలికి భవిష్యత్తుపై ఆశ కల్పించి యీ కత్తికోతలు పడమని త్రోశాను. మూడుగంటలు-యిద్దరు డాక్టర్లు యింకా హౌసు సర్జనులు నర్సులు పరుగులెత్తుతున్నారు. పనిముట్లు 'స్టౌ'లో మరగబెడుతున్నారు. తరువాత డాక్టరు నెత్తురు మరకలతో నిండిన రబ్బరుగౌనుతో యీవ లకువచ్చి నాకేసిచూసి 'పూర్తయింది' అని గంభీరంగా అన్నాడు. అయ్యో! ఆ నెత్తురంతా నీలిదేనా? మరో పదినిముషాల్లో స్ట్రెచరు మీద మనిషిని పడేసి ఇంకా పచ్చిగా కారుతున్న నెత్తురుముద్దను స్పెషలు వార్డులోకి తీసికెళుతూండగా చూశాను. చూసి కెవ్వుమని కేకపెట్టలేక చేరుమాలుతో నోరు నొక్కుకున్నాను. అంతకన్నా శవం నయం. నా ఆంతర్యంలోని తుఫాను యేమని చెప్పుకోను? ఎవరన్నా చూస్తారన్న అభిమానమన్నా లేకుండా గోడవారను చేరగిలబడి యేడ్చే శాను. కళ్ళు నులుము కుంటూండగా మల్లయ్య భార్యా ముసలావిడ 'యేది? యేది?' అంటూ నావైపు వస్తున్నారు.

మీ అందరికీ తలో అబద్ధమూ చెప్పి నమ్మించాను. మీ నీలిని యీ ఆసుపత్రిలోని కత్తులన్నీ ముక్కలుముక్కలుగా కోస్తూంటే మొద్దులా బల్లమీద కూర్చొని కళ్ళప్పగించాను. మీ అమ్మాయి నెత్తురు చిందిన డాక్టరుగారి కోటునుకూడా చూశాను. ఇంకా నేనేదో ఆజన్మాంతమూ మరపురాని వుపకారం మీకు చేసినట్లుగా నన్నే వెంబడి స్తున్నారే అనిపించింది.

అంతా కలిసి స్పెషలు వార్డుదగ్గర కెళ్ళాము. కాని నేను యీ అబద్ధపుముఖం వేసుకుని ధైర్యంగా ఆ పిల్లముఖాన్ని ఎట్లా చూడ గలను? బయటే నిలబడ్డాను. మల్లయ్యా అతడిభార్యా 'తన నెత్తురు ముద్దను' చూసి లబోదిబో మంటున్న ముసలమ్మగార్ని నెమ్మదిగా యీవలకు తీసుకొచ్చి పూరడిస్తున్నారు.

ఉదయం పది పదకొండుగంటలకు పూర్తయిన ఆపరేషను మనిషికి తెలివి వచ్చేసరికి నాలుగున్నర అయింది. చూడ్డానికి వెళ్ళి తలాపిదిక్కున నిలబడ్డాను. 'తల్లీ—' అంటూ ముసలమ్మగారు దీనంగా నిలబడ్డ మల్లయ్య భార్య ముఖాలను—కళ్ళు విప్పిచూసింది. చెంపలనుంచి నీరు వెచ్చగా స్రవిస్తున్నది. నేను చేతితో తుడవ పోయాను. సర్జను ముట్టుకోనివ్వలేదు. చేయి వెనక్కు లాక్కుంటు న్నాను. తల త్రిప్పబోయి నీలి గట్టిగా మూలిగి మళ్ళీ మత్తులోకి జారుకున్నది.

డాక్టరు ఒక యింజక్షను యిచ్చాడు. బాండేజీని పచ్చినెత్తురు యెండి పోతూవుంది. డాక్టరుమటుకు చాలా గంభీరంగానే వున్నాడు. వెళ్ళిపోతూ జాగ్రత్తగా కనిపెట్టుకు చూడవలసిందనీ, గంటగంటకు యింజక్షను యిచ్చి మనిషిని తట్టుకొనేలా చూడమనీ చెప్పాడు.

నిశ్శబ్ద సంపుటాల్లాగా అంతా వరండాలో బెంచీలమీద కూర్చు న్నారు. పక్కదగ్గర చిన్న స్టూలుమీద కూర్చుని నేను ఆమెకేసే చూస్తు న్నాను. సన్నగా వూపిరి పీలుస్తూ వదులుతున్నది. మెడదాకా తెల్లటి దుప్పటి వున్నది. ఆ తల్లో యింకా నేను కొనిచ్చిన పిన్నులు జుత్తును చెదరనివ్వకుండా అదిమి వుంచాయి. ముఖం బాధాదష్టమై అగపడు తోంది. గంటగంటకు యింజక్షను....బాగా రాత్రి తొమ్మిదికూడా కొట్టాక నీలికళ్ళు విచ్చి చూసింది. దగ్గరసా వంగాను. కళ్ళు నీటిని నింపుకుంటున్నాయి. నేను వొణికే గొంతుకతో 'ఎట్లా వుంది నీలీ?' అన్నాను.

"ఏ—ం—చె—ప్ప—ను?" అని మాత్రం అనగలిగింది.

"అమ్మనూ వాళ్ళనూ పిలిచేదా?"

జాలిగా చూస్తోంది 'వూ' అని.

మళ్లీ అంతా చుట్టూ నిలబడ్డాము.

"ఏం కావాలి తల్లీ?" అంది ముసలమ్మగారు.

"నా—కే—ం—కా—వా—ల—మ్మా—" అంది ఏడుస్తూ.

"ఏడవకమ్మా...." అంటున్నాడు మల్లయ్య.

మళ్ళీ తెలివిపోయింది. ఈ మారు ఆఖరి రౌండుకు డాక్టరే వచ్చి చూసి బాండేజీ అదీ పరీక్షచేసి మరో యింజక్షను యిమ్మని చెప్పి వెళ్ళిపోయాడు. అంతా వరండాలో బెంచీలమీదపడి నిద్రపోయారు. నాకు నిద్ర ఎట్లా పడుతుంది? సిగరెట్లు కాలుస్తూ వరండాలో పచార్లు చేస్తున్నాను. సన్నగా మూలిగినట్లు అనుమానం వేసింది. వెళ్ళి ప్రక్కదగ్గర నిలబడ్డాను. గొణుగుకుంటోంది. చెవిదగ్గరసా పెట్టి విందామనుకున్నాను. ఏడుపులో ఆ మాటలు తెలియలేదు. తర్వాత మళ్ళీ అనుకుంటోంది, "నాకు కాలు వస్తుందా?" అని. అక్కడ్నుంచి లేచాను. తెలివి తెరలకుమల్లే వచ్చి తప్పుకుంటోంది. ఇక మళ్లీ నిద్రపోవటం కూడా కష్టమే. దగ్గరసా వెళ్ళి చేత్తో భుజం తట్టాను. కళ్ళు విప్పకుండానే దుప్పటీ అడుగునుంచి నాకు చేతులు అందివ్వబోయింది. నెమ్మదిగా ఆ చేతులను అందుకుని తలకాయ వంచి వాటిలో నా ముఖం వుంచాను.

నన్ను గుర్తుపట్టిందో, పలవరిస్తున్నదో కాని—నెమ్మదిగా అంటున్నది 'నాకు పెళ్లవుతుందా? నన్నెవరు చేసుకుంటారు?' అని. స్టూలుమీద కూర్చున్న నేను తలెత్తి నా నిష్కామకర్మ పిచ్చినంతా వెనక్కునెట్టి అడిగాను—

"అడుగు నీలీ—నీకేం కావాలన్నా అడుగు, చెప్పు. ఏం కావాలి?"

"నాకు కాలు వస్తుందాండీ?"

ఒకప్రక్కనుంచి నా హృదయం బీటలువారుతున్నా అణచుకుంటూ అన్నా—"తప్పకుండా వస్తుంది."

నాకే తెలియదు భగవంతుడు యేం చేయనున్నాడో....

నా చేతులు తన చేతుల్లోకి తీసుకుని గుండెలవరకూ నీరసంగా లాక్కుంటూ "నాకు పెళ్లవుతుందాండీ?" అంది.

"ఆహా....తప్పకుండా—"

ఒకప్రక్క దిండుమీద తిరగేసినట్లున్న తలను చేతితో నిము రుతూ ఆప్యాయంగా అన్నాను.

కళ్ళుతెరచి నా ముఖంలోనికి చూస్తూ అంది. "నన్నెవరు చేసు కుంటారు చెప్పండి" అని.

ఒక్కక్షణం ఆలస్యం చేశాను.

మళ్ళీ తెలివి తప్పిపోయింది. నేను మరో సిగరెట్టు తీసి ఈవ లకువచ్చి ముట్టించాను. ఆ మధ్యన మేం కబుర్లాడుతూ రోజూ కూర్చునే బల్ల, చిన్న తోటా—రకరకాల పచ్చటి చెట్లూ, అన్నీ చీకట్లో నిద్రిస్తు న్నాయ్. నక్షత్రాలు అబద్ధాలాడే మనుష్యుల ముఖాలు చూడలేక గావల్ను చిన్నబుచ్చుకున్నట్లు సన్నగా వెలుగుతున్నవి. ఒకప్పుడు ముష్టిపిల్ల అని బేడా మీదకు విసిరేశాను. కంట కనుపిస్తే ఛీ పొమ్మన్నాను. తల్లి యెదురుగ్గా బిడ్డను అసహ్యించుకున్నాను. కాని ఏం సంబంధం లేక పోతే ఇప్పుడు ఈ వరండాలో పడి....నీకు మంచిరోజులున్నాయని ఆశ బెట్టిన నేను నీలి ముఖం చూడ్డానికి భయపడుతున్నాను? మళ్లీ అడుగు తుంది. ఏం చెప్పను?

దూరాన ఉండీ ఉడిగిన ఏదో లారీకాని బస్సుకాని పసుగెత్తు తున్న ధ్వని, ఏదో మూలనుంచి పరుగెట్టి వస్తూన్న రైలు చప్పుడు గాలిలో కొట్టుకొస్తున్నాయి. హౌసు సర్జను కంగారుగా ఈవలకు వస్తున్నాడు.

"ఏమిటి?" అంటూ ఎదురు వెళ్లాను.

"బాండేజీ కదిలి నెత్తురు లీకవుతున్నది. డాక్టరుకు ఫోను చెయ్యాలి. కాని మీరెవళ్లూ వాళ్ల తాలూకు మనుష్యుల్ని లేపకండి. గొడవ చేస్తారు" అంటూ పరుగెత్తాడు.

నేను నెమ్మదిగా ప్రక్కవద్దకు చేరుకుని నల్లరాయిలా స్టూలు మీద చతికిలబడి ఆమె ముఖంలోకి చూస్తున్నాను. నా అంతరాంతరా ల్లోంచి నీలి వెళ్ళిపోతున్నదని తోచింది. తల ప్రక్కమీద వాల్చి వెక్కి వెక్కి ఏడ్చాను. నా తలమీద నీలి చేయి వేసింది.

కళ్ళు తుడుచుకుంటూ ఆమెలోకి చూశాను.

"న-న్నె-వ-రు పెళ్లి-చే-సు-కుం-టా-రు?" అంటోంది జాలిగా.

ఆడేస్తాను. నిష్కామకర్మగా అబద్ధం చెప్పేస్తాను. కొన్ని గంటల నిముషాల్లో వెళ్ళిపోయే ప్రాణికి బ్రహ్మాండమైన తృప్తి కలిగిస్తుందంటే ఒక చిన్న అసత్యం ఆడ్డానికి నే నెందుకు జంకాలి?

అయ్యో! చనిపోతున్నదని తెలిసి కూడా అబద్ధం చెప్పనా? అని వెనక్కు లాగుతున్నది మనస్సు.

మానవత్వమనేది యే కోశాన్నయినా వుంటే చెప్పు—ఈ క్షణాలు జారవిడిస్తే మళ్ళీ నిన్ను యెప్పటికీ ఏమీ అడగదు ఆ ప్రాణి. ఇప్పుడే ప్రపంచంలో ఆమెకు ఏదన్నా సంతృప్తిగాని సుఖంగాని కలిగించే మాట ఏదన్నా ఉంటే, అది నీ నోటినుంచే రావాలి? ఊ—త్వరపడు! ఇందులో నీకేమీ స్వార్థం లేదేం? అంటూ ఎవరో హెచ్చరించినట్లుగా అయింది.

నా నరనరాలు కూడదీసుకుని దీక్షగా ఆమెకేసి చూశాను. నేనున్న పరిస్థితిలో ఎవ్వరూ ఎప్పుడూ ఉండివుండరు. ఒకప్పుడు మనసా యేవగించుకున్న మనిషికోసం, ఇప్పుడు అబద్ధం చెప్పి—సంతృప్తితో నిండిన ఆ ప్రాణి హృదయాంతరాల్లోని యేకైక పీఠాన్ని అధిష్ఠించబోతున్నాను.

డాక్టరు గబగబా వచ్చాడు. నేను బయటకు నడిచాను.

కాని నామీద అనేకవేల హండ్రడ్వెయిట్ల బరువు ఉన్నట్లు తోచింది. నిద్రలేక నా ముఖం నానా అసహ్యంగాను ఉండొచ్చు. పంపు దగ్గరకు వెళ్ళి శుభ్రంగా ముఖం తోముకొచ్చాను. ముసలమ్మగారు, మల్లయ్య లేచి కూర్చుని నావంక చూశారు.

డాక్టరు హౌసు సర్జనుతో 'వాతం కమ్మకుండా చూడాలి' అంటున్నాడు.

నేనేం చెప్పగలను? అయ్యో, నీలి బ్రతికే ఆశలేదని తెలిసీ ఆమె ప్రశ్నకు జవాబు చెప్పకుండా ఆలస్యం చేశాను. ఈ మారు నా సర్వశక్తులనూ కేంద్రీకరించుకోవటానికి ప్రయత్నం చేశాను.

ముగ్గురం వెళ్ళి నీలి ప్రక్క నిలబడ్డాము.

హౌసు సర్జను పల్సు వ్రాసుకుంటున్నాడు. టెంపరేచర్ నోట్

LIBRARY, CUDDAPAH.
52293

చేసుకుంటున్నాడు. కత్తి కోతలకు పోగా మిగిలిన దేహాన్ని సూదులతో తూట్లు పొడుతున్నాడు. నీలికి తెలివి వస్తున్నది. కాని మాట రావటం చాలా కష్టంగా వుంది. కళ్ళు తెరిచే వోపిక కూడా ఉన్నట్లు లేదు.

మల్లయ్య భార్య వెర్రిపిల్లాడ్ని వెంటబెట్టుకుని వచ్చింది. నాకు మాత్రం వాడి ముఖాన్ని నీలికి చూపించటం యెంత మాత్రం ఇష్టం లేదు. కాని అప్పుడు నే నేమన్నా బాగుండదు. ఊరుకున్నాను. వాడు మంచం దగ్గరసా వెళ్ళి మీదకు వ్రాలుతున్నాడు. చేత్తో కదుపుతాడేమో, ఎక్కడ బాధపడుతుందోనని నేను వాడ్ని కొంచెం వెనక్కు లాగాను. ముఖంమీద ముఖంపెట్టి పరీక్ష చేస్తున్నాడు. తప్పు అని నేను ముక్కు మీద వ్రేలుబెట్టుకు చూపాను.

ఆలస్యంగా ఆహారానికి బయల్దేరిన పిట్టలు మాత్రం బహు బద్ధకంగా ఆకాశంలో రెక్కలు కొట్టుకుంటూ ముందుకు పోతున్నాయి!

ఉదయం యెనిమిది గంటలప్పుడు కాబోలు నెమ్మదిగా యేడుస్తున్నది. ముఖం మరీ పల్చగావుంది. చెవులకు ఎర్రటి రాళ్ళు బాగా మెరుస్తున్నై. చిన్న ఎర్రగన్నేరు పువ్వు యెక్కడన్నా దొరికితే బాగుండును....

రాత్రి కొంతసేపు నిద్రపట్టి ఉండాలి, లేకపోతే రాత్రిళ్ళు యేడవ నిది ఇప్పుడే లేచి గోలపెడుతున్నదేం?

"నిద్రపోయావా?" అన్నా.

మత్తులో ఉన్నట్లు కళ్ళువిప్పి "పో-తా-ను. ని-ద్ర-పో-వా-ల-ని-వు-ం-ది" అన్నది.

వెర్రిపిల్లాడు చొరుచుకొచ్చి వంగి వంగి పరీక్షగా చూస్తున్నాడు. నీలి చేతిని నెమ్మదిగా ఊయించింది. వాడు దగ్గరగా వచ్చి వంగున్నాడు. ఆ గ్రద్ద ముక్కును చేత్తో పుచ్చుకుని లాగింది. నేను నవ్వాను. నా వైపు కొరకొరా చూస్తూ ఛెంగుమని దూకేశాడు అక్కడ్నుంచి.

నీలి అంటోంది జాలిగా 'నేను బ్రతుకుతానా....' అని.

"అయ్యో! నువ్వు బ్రతక్కపోతే యెట్లా....నా కోసమన్నా బ్రతుకుతావు."

"అంటే...."

"నేనే నిన్ను పెళ్ళాడుదా మనుకుంటున్నాను."

"మీరా...."

ఆశ్చర్యంతో నీలి నా ముఖంలోకి చూసింది. నేను నవ్వాను. చేత్తో ఆమె చేతిని తీసుకుని "నేనే పెళ్ళాడుతాను నీలీ, నిన్ను. లేకపోతే ఇంత శ్రమ యెందుకు తీసుకుంటాననీ? మరి ఇప్పుడు చెప్పు. నా కోసమన్నా బ్రతుకుతావుగదూ?" అన్నాను.

నీలి హృదయపూర్వకంగా నవ్వింది.

ఆ శరీరంలో అక్కడా అక్కడా ప్రాణిని నిలబెట్టడానికి యింకా మిగిలివున్న రక్తము ఆమె చెంపల్లోకి చేరుకుంటోంది. నేను ప్రేమతో నా రెండు చేతుల్నీ ఆమె చెంపలకు రాస్తూ—

"రాత్రల్లా నన్నెవరు పెళ్లాడుతారు? అంటూ పలవరించావు తెలుసునా—" అన్నాను.

"అల్లాగా....నా కేదీ సరిగ్గా జ్ఞాపక ముండటం లేదు."

"అప్పుడు చెబితే....ఆ సంతోషానికి తట్టుకోలేవేమోనని—"

చాలు! ఆమె ముఖం నిండుగా వొక్కమారు వెలిగింది.

నేను నాటకంలో నా పాత్రను చాకచక్యంతో నిర్వహించా ననుకుంటాను. తరువాత నీలి యేమైందో నాకు తెలియదు. తెలుసుకోవాలనీలేదు. ఆ రోజు మాత్రం ఆదరాబాదరాలో ఆసుపత్రి నుంచి యెవ్వరూ చూడకుండా పారిపోబోతూంటే, గేటు దగ్గర పెద్ద గ్రుడ్లు చేసుకుని నిలబడ్డ వెర్రిపిల్లాడు, నన్ను పసిగట్టి వెంబడిస్తాడన్న భయంతో మరో మార్గంగుండా వీధిలోకొచ్చి పడ్డాను.

ఉదయం వొకవైపునుంచి జోరుగా యెండ కాస్తూంటే వెనుక నుంచి నల్లటి మేఘం సూర్యరశ్మిని తరుముకొస్తోంది. తడబడుతూన్న కాళ్ళతో నేను వస్తూంటే 'బాబా కుంటివాణ్ణండయ్యా! గ్రుడ్డివాణ్ణండయ్యా! కలిమిగల మారాజులు. ఒక్క కానీ ధర్మం చెయ్యండి బాబూ!' అన్న కేకలు నా కర్ణపుటాల్ని ఛేదించుకొని నన్ను వెనకనుంచి మరీ మరీ ముందుకు తరిమాయి.

———